epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
SAMAYAM

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 36 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 13 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |




## శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కాళేశ్వరం

# పునరుద్ధరణ

### సరి చేసేందుకు ప్రభుత్వం చర్యలు

**20 రోజుల్లో పనులు ప్రారంభం**

- సీడబ్ల్యూసీ, సీసీడబ్ల్యూపీఆర్ఎస్ పర్యవేక్షణ
- నివేదికల ఆధారంగా ముందుకు వెళ్తాం
- మరమ్మతు ఖర్చుల బాధ్యత కాంట్రాక్టర్లదే!
- అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణ, సాంకేతిక సమీక్షలు వేగవంతం అవుతున్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ బారేజీలు, మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా పై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఈ క్రమంలో నీటివనరుల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**హైదరాబాద్, నవంబర్ 12:** కాళేశ్వరం పునరుద్ధరణపై శాస్త్రీయ విధానంలో చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. అయితే ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కసర్తతు జరుగుతోందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కసరత్తు జరుగుతోందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆనకట్టల పునరుద్ధరణ సహా నీటిపారుదలశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై

మిగతా 2 లో

### స్టార్టప్‌లు పెట్టేవారికి ప్రోత్సాహం

యువత కొత్త ఆలోచనలతో రావాలి
మంత్రి శ్రీధర్‌బాబు 2

### వరుస రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం



- రాష్ట్రవ్యాప్తంగా 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్
- రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు
- రవాణాశాఖ ఉన్నత అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

2

## ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి ప్రధాని మోదీ



- ఢిల్లీ పేలుడు బాధితులకు పరామర్శ
- బాధితులతో నేరుగా మాట్లాడిన ప్రధాని
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా

3

ఢిల్లీ పేలుడు ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం పరామర్శించారు. రెండ్రోజుల భూటాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ప్రధాని ఆ వెంటనే లోక్‌నాయక్ జయప్రకాష్ ఆసుపత్రికి వెళ్లారు. బాధితులతో నేరుగా మాట్లాడి త్వరగా కోలుకోవాలని అభిలషించారు.

## ఢిల్లీ పేలుడు ఘటన కిరాతక చర్య

- తీవ్రంగా ఖండించిన కేంద్ర కేబినేట్
- మృతులకు మంత్రివర్గం సంతాపం
- ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుందని ప్రకటన

5



### పేలుళ్లతో బీజేపీకీ ఏం సంబంధం!

మెదక్ ఎంపీ రఘునందన్

.. వివరాలు 3లో



### మదనపల్లిలో కిడ్నీ రాకెట్ గుట్టురట్టు

- కిడ్నీ ఇచ్చిన మహిళ మృతితో ఫిర్యాదు
- తనిఖీ చేసి ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు

.. వివరాలు 5లో

## మేడారంలో మంత్రుల పర్యటన

- పనులను పర్యవేక్షించిన మంత్రులు
- భక్తులకు ఇబ్బంది లేకుండా సకాలంలో పూర్తికి చర్యలు



**ములుగు, నవంబర్ 12:** మేడారంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పదికోట్ల మంది భక్తులు వచ్చినా దర్శనానికి ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నామని తెలిపారు. మేడారంలో తెలంగాణ మంత్రులు పర్య టించారు. బుధవారం మంత్రులు పొంగులేటి, సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్

మిగతా 2 లో

### ఆత్మాహుతి దాడిలో మరో కారు

గుర్తించిన కారు కోసం గాలింపు

4




## పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తాం

- గృహ నిర్మాణానికి ముస్లింలకు రూ.50 వేల అదనపు సాయం
- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.900 కోట్ల బిల్లులను చెల్లిస్తామని హామీ
- ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా మరో 5.9 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు
- దేవగుడిపల్లిలో గృహప్రవేశాల కార్యక్రమంలో చంద్రబాబు
- జగన్ హయాంలో అంతా విధ్వంసమేనని విమర్శలు

**అన్నమయ్య :** తమది పేదల ప్రభుత్వమని.. వారికి న్యాయం చేసేందుకు పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని అన్నారు. చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మూడు లక్షల గృహాలను వం-ర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. 17 నెలల్లో ఇళ్లు పూర్తిచేసి

మిగతా 5 లో

### సీఐఐ సదస్సు కోసం విశాఖ సిద్ధం

సర్వాంగ సుందరంగా ముస్తాబైన వైజాగ్
విశాఖకు చేరుకున్న సీఎం చంద్రబాబు

5



# వేములవాడలో దర్శనాలు నిలిపివేత

**ఆగ్రహం వ్యక్తం చేసిన భక్తులు**

**వేములవాడ, నవంబర్ 12:** ఆలయ విస్తరణ పనులు కొనసాగుతుండడంతో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దర్శనాలను నిలిపివేశారు. ఆలయ అధికారులు ముందస్తు ప్రకటన లేకుండా దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం ఎదుట స్వామివారి దర్శనం కోసం బుధవారం తెల్లవారుజామున భక్తులు నిరీక్షించారు. ఆలయ ప్రధాన గేటుకు కూడా అధికారులు తాళం వేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన గేటు నుంచి ఆలయం లోపలికి వెళ్లకుండా అడ్డంగా రేకులు ఏర్పాటు చేశారు అధికారులు. ఈ నేపథ్యంలో భక్తులు ఆలయం ఎదుట ఆందోళనకు దిగారు. అయితే, రాజన్న ఆలయం ఎదుట ప్రచార రథంపై స్వామివారి దర్శనం కల్పించారు. ఎల్ఈడీ తెరపై స్వామివారి దర్శనం భక్తులకు కల్పించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ విస్తరణలో భాగంగా ఇప్పటికే భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు రాజరాజేశ్వరస్వామి స్వామి ఆలయ అధికారులు. ఎంతో దూరం నుంచి వచ్చి స్వామివారికి మొక్కు చెల్లిందమని వస్తే ఆలయ అధికారులు ఇలా చేయడం భావ్యం కాదని భక్తులు మండిపడుతున్నారు. ఇంత చలిలోనూ స్వామివారి దర్శనం కోసం వేచి చూస్తున్నామని.. అయినా అధికారులు కనికరించడం లేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాడి కౌశిక్ రెడ్డిపై పోలీస్ కేసు

**హైదరాబాద్, నవంబర్12 :** హైదరాబాద్ మధురానగర్ పీఎస్‌లో పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎన్నికల సందర్భంగా యూసఫ్‌గూడ వద్ద కౌశిక్ రెడ్డి హల్చల్ చేశారు. తన అనుచరులతో కలిసి మహమ్మద్ ఫంక్షన్ హాల్లోకి కౌశిక్ రెడ్డి దూసుకెళ్లారు. పోలీసులు వద్దని చెప్పినా వినకుండా కౌశిక్ రెడ్డి లోపలికి నెట్టుకెళ్లారు. దీంతో ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ కౌశిక్ పై కేసు నమోదయింది. ట్రేస్ పాస్‌తో పాటు న్యూసెన్స్ కేసును కూడా మధురానగర్ పోలీసులు నమోదు చేశారు.

# కాళేశ్వరంపై విచారణ జనవరికి వాయిదా

**హైదరాబాద్, నవంబర్ 12:** కాళేశ్వరం కమిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు మరో 3 వారాలు గడువు ఇచ్చింది. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్కే జోషికి 3 వారాల గడువు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇకపోతే ఈ వ్యవహారంలో ప్రభుత్వం సిబిఐ విచారణకు ఆదేశించింది. అయితే ఇంతవరకు సిబిఐ రంగంలోకి దిగలేదు. దీనిపై ఇటీవలే సిఎం రేవంత్ రెడ్డి కూడా విమర్శలు సంధించారు.

## నటుడు నాగార్జునపై వ్యాఖ్యలు
# వెనక్కి తీసుకుంటున్నా

**లెంపలు వేసుకున్న కొండా సురేఖ**



**హైదరాబాద్, నవంబర్ 12:** ప్రముఖ నటుడు నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ వెనక్కి తీసుకున్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానన్నారు. ఈ మేరకు ఆమె ఓ పోస్టు పెట్టారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు–ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా అని పేర్కొన్నారు. అయితే ఈ వ్యవహారంలో ఇప్పటికే నాగార్జున పరువనష్టం కేసు వేశారు.

# ఢిల్లీ పేలుడు ఘటనపై ఇజ్రాయిల్ బాసట



**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఢిల్లీ కారు బాంబ్ బ్లాస్ట్ దేశాన్ని మరోసారి కలవరపెట్టిన సందర్భంగా ఇజ్రాయిల్ భారత్‌కు మద్దతు తెలిపింది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ఈ ఘటనపై స్పందించారు. బాధిత కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ' మా ప్రియమైన మిత్రుడు నరేంద్రమోడీకి, భారతదేశంలో ధైర్యవంతులైన ప్రజలకు.. నేను, ఇజ్రాయిల్ ప్రజలు, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ విషాద సమయంలో ఇజ్రాయిల్ మీతో బలంగా నిలుస్తుంది' అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భారత్, ఇజ్రాయిల్ పురాతనమైన నాగరికతలు అయినప్పటికీ, అవి ఒకే రకమైన కఠిన పరీక్ష అయిన ఉగ్రవాదంతో బాధపడుతున్నాయి, రెండు దేశాలు ఉగ్రవాదానికి ఎప్పటికీ లొంగిపోవని నెతన్యాహూ అన్నారు. భారత్, ఇజ్రాయిల్ శాశ్వత సత్యాలపై నిలబడే పురాతన నాగరికతలు, దాడులు మన నగరాలను తాకవచ్చు కానీ, మన ఆత్మలను ఎప్పటికీ కదిలించలేవు, మన దేశాలు వెలుగులు మన శత్రువుల చీకటిని అధిగమిస్తాయి అని ఆయన అన్నారు. ఈ దాడిలో పాకిస్తాన్ ఉగ్ర సంస్థ జైషే మహ్మద్ ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఢిల్లీ మాత్రమే కాకుండా గురుగ్రామ్, ఫరీదాబాద్ వంటి ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో కూడా దాడులు చేయాలని ఈ ఉగ్ర డాక్టర్లు ఎ÷–లాన్ చేశారు. ఆత్మాహుతికి పాల్పడిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీ అని భావిస్తున్నారు. ఇప్పటికే మరో ముగ్గురు డాక్టర్లు షహీన్ సయీద్, ముజ్మిల్ షకీల్ గనాలే, అదీల్ రాథర్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. నెతన్యాహుకు ముందు ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి గిడియన్ సార్ కూడా భారత్ దేశానికి సంఘీభావం తెలిపారు. ఢిల్లీ కారు బాంబ్ బ్లాస్ట్‌లో చనిపోయిన అమాయక బాధిత కుటుంబాలకు ఇజ్రాయిల్ తరుపున సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. భారతదేశంలో ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ కూడా ఈ దాడిని 'హృదయ విదారకమైంది'గా అభివర్ణించారు.

# శాస్త్రీయ, సాంకేతిక విధానంలో కాళేశ్వరం పునరుద్ధరణ

మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. బిఆర్ఎస్ హయాంలో భారీ వ్యయంతో నిర్మించిన ఆనకట్టల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మేడిగడ్డ ఆనకట్ట దెబ్బతినడానికి.. అన్నారం, సుందిళ్ల ఆనకట్టలో లీకేజీలకు గల కారణాలు, వైఫల్యాలను విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జ్యుడీషియల్ కమిషన్ నివేదికలు పేర్కొన్నాయని తెలిపారు. డిజైన్లు – నిర్మాణం – నిర్వహణలో లోపాలు, సరైన నమూనా అధ్యయనాలు లేకపోవడాన్ని ఎన్డీఎస్ఏ నివేదిక ప్రధానంగా ప్రస్తావించిందని.. ఆర్థికపరమైన అవకతవకలు, ప్రణాళికాలోపాలను జ్యుడీషియల్ కమిషన్ పేర్కొందని తెలిపారు. అవకతవకలు, నిర్లక్ష్యం వహించినందుకు కొందరు అధికారులు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ సిఫారసు చేసిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయపరంగా, ఇంజనీర్ల స్థాయిలోనూ లోపాలు ఉన్నాయన్న మంత్రి.. ఆనకట్టలను సాంకేతిక విధానంలో సరిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సీడీఓ లోపాలను కూడా విచారణ సంస్థలు ఎత్తిచూపినందున నైపుణ్యం కలిగిన సాంకేతిక సంస్థలు, కన్సల్టెంట్ల సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కన్సల్టెన్సీ సేవల కోసం పలు సంస్థలు ముందుకొచ్చాయని, 3 తుదిదశకు అర్హత సాధించాయన్న మంత్రి.. ఐఐటీ లాంటి సంస్థలతో కలిసి పనిచేసే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడబ్ల్యూపీఆర్ఎస్ అవసరమైన పరీక్షలు చేస్తోందని, వరద ఉధృతి తగ్గిన వెంటనే మరో 15, 20 రోజుల్లో జియోఫిజికల్, హైడ్రాలిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.



# వరుస రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

**రాష్ట్రవ్యాప్తంగా 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్**

**రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు**

**రవాణాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష**



**హైదరాబాద్,నవంబర్12:** వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయిలో 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్, రాష్ట్ర స్థాయిలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో రవాణాశాఖ ఉన్నతాధికారుల తో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా నిరంతరం ఉండేలా ఎ÷–లాన్ ఆఫ్ యాక్షన్ చేపడుతున్నట్లు వివరించారు. అందులోభాగంగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించడానికి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్, పెనాల్టీతో పాటు ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుంటామని వివరించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు వివిధ ప్రాంతాల నుంచి సమాచారం అందుతుందని చెప్పారు. శాండ్, ÷÷–ల యాష్, స్టోన్, బిల్డింగ్ మెటీరియల్స్ తరలించే వాహనాలను ప్రత్యేకంగా తనిఖీలు చేపడతామన్నారు. అందుకోసం డీటీసీ, ఎంవీఐ, ఏఎంవీఐలతో కూడిన బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అయితే ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు, వ్యవసాయ ట్రాక్టర్ల వారిని వేధించ వద్దని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలు, ఓవర్ స్పీడ్ వాహనాలతోపాటు సీసీ బస్సులు సీజ్ చేయాలని స్పష్టం చేశారు. జేటీసీ, డీటీసీలు ప్రతి వారం రెండుసార్లు అంతర్రాష్ట్ర సీసీ బస్సులను తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. టిప్పర్లు, ట్రాలీలు టార్పాలిన్‌తో కప్పకుండా వస్తే చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం చేవెళ్ల ప్రమాదం తర్వాత 2,576 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాటిలో 352 లారీలు, 43 బస్సులు ఉన్నాయని వివరించారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు వేగవంతం చేయాలని.. సిబ్బందికి శిక్షణ బాట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలకు ఉపాధి అవకాశాల కోసం మహిళా ఆటోలకు అనుమతులు మంజూరు చేయాలని మంత్రులను ఆదేశించారు. రోడ్ సేఫ్టీ మంత్ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు, చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్‌ల వద్ద చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

# పార్లమెంటరీ స్థాయీ కమిటీ సమావేశం

**ఎర్రకోట పేలుళ్లపై చర్చకు తిరస్కరణ**

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఎర్రకోట సమీపంలో పేలుడు అంశం బుధవారం జరిగిన హోం వ్యవహారాలపై పార్లమెంటరీ స్థాయీ కమిటీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే దీనిపై చర్చించేందుకు చైర్‌పర్సన్ నిరాకరించారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, ఢిల్లీ పేలుడు ఘటనలో 12 మంది మృతి చెందిన అంశాన్ని లేవనెత్తేందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ఒకరు ప్రయత్నించారు. ఇంటెలిజెన్స్ వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేసారు. అయితే అంశంపై చర్చ చేపట్టేందుకు కమిటీ చైర్‌పర్సన్ రాధా మోహన్ దాస్ నిరాకరించారు. దీనిపై సుమోటో ప్రకటన చేసేందుకు కూడా నిరాకరించారు. విపత్తు నిర్వహణ ఎజెండాపై పార్లమెంటరీ కమిటీ బుధవారంనాడు సమావేశమైంది. దీనిపై తమ అభిప్రాయాలు చెప్పేందుకు హోం మంత్రిత్వ శాఖ, నేషనల్ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజిమెంట్ , నేషనల్ డిజాస్టర్ రెస్పాన్ ఫోర్స్, ÷ర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ క్యాంప్, హోం గార్డ్స్ డీజీలు హాజరయ్యారు.

# ఢిల్లీ పేలుళ్ల వెనక జైషే మహ్మద్ ప్రమేయం

**న్యూఢిల్లీ,నవంబర్12 :** ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనతో యావద్దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ దాడి వెనుక పాక్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ ప్రమేయం ఉన్నట్టు వెల్లడవుతుండటంతో మరోసారి జైషే ఉగ్రవాది మసూద్ అజార్ పేరు తెరపైకి వచ్చింది. ఐఎస్ఐ నిధులతో ఉగ్రవాదాన్ని నడిపిస్తున్న అజార్‌కు 26/11 ముంబై దాడుల నుంచి తాజాగా ఢిల్లీ బ్లాస్ట్ వరకూ ప్రమేయం ఉందని నిఘా సంస్థలు బలంగా నమ్ముతున్నాయి. పాక్ గడ్డపై అజార్ లేడని ఆ దేశం బుకాయిస్తున్నప్పటికీ ఇస్లామాబాద్ అండదండలతో అతను స్వేచ్ఛగా పాక్ గడ్డపై ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఇప్పుడు ఎర్రకోట వద్ద జరిగిన 10/11 బ్లాస్ట్‌లో ఆయన ప్రమేయంపై మరోసారి అనుమానాలు బలపడుతున్నాయి. తాజాగా ఢిల్లీ పేలుళ్లు ఘటనలో పలువురిని అరెస్టు చేయడంతో జైషే ప్రమేయం మరోసారి బయటకు వచ్చింది. జైషే లింక్స్‌పై ఇటీవల ఫరీదాబాద్‌లో అరెస్టయిన మెడికల్ కాలేజీ డాక్టర్ షహీన్ సయీద్ ఇండియాలో జమాత్ ఉల్–మోయినాత్ యూనిట్ చీఫ్‌గా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

# స్టార్టప్‌లు పెట్టేవారికి ప్రోత్సాహం

**యువత కొత్త ఆలోచనలతో రావాలి • మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు**



**హైదరాబాద్, నవంబర్ 12:** యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. రాయదుర్గం టీ హబ్‌లో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని పేర్కొన్నారు. ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తెచ్చినట్లు వివరించారు. వీటి ద్వారా స్వం శక్తులుగా ఎదగాలన్నారు. అంకుర పరిశ్రమలు రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలి. స్టార్టప్‌లకు సాయం చేసేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోంది. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఇతర దేశాల్లోని అవకాశాల కోసం చూడవద్దు. ఇతర దేశాలు మనపై ఆధారపడే స్థితిక మనం ఎదగాలని శ్రీధర్‌బాబు అన్నారు.



# మేడారంలో మంత్రుల పర్యటన

**పనులను పర్యవేక్షించిన మంత్రులు**

**భక్తులకు ఇబ్బంది లేకుండా సకాలంలో పూర్తికి చర్యలు**

**ములుగు, నవంబర్ 12:** మేడారంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పదికోట్ల మంది భక్తులు వచ్చినా దర్శనానికి ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నామని తెలిపారు. మేడారంలో తెలంగాణ మంత్రులు పర్యటించారు. బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ మేడారం చేరుకుని... అక్కడి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఆపై వనదేవతలను దర్శించుకున్నారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తూ పనులు చేస్తున్నామని... ఆదివాసీ పూజారుల ఆలోచనతోనే పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. గతంలో మేడారంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.. సీఎం రేవంత్ రెడ్డి వచ్చాక మేడారం అభివృద్ధి జరుగుతోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని.. దీనిపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ప్రధాన మంత్రిని నరేంద్ర మోడీని ఒప్పించాలని మంత్రి సీతక్క కోరారు. మేడారం మహాజాతర నాటికి పనులు పూర్తవుతాయని.. జాతర నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మేడారం అంటే తమ బంధం, భక్తి, భావోద్వేగం, బాధ్యత అని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. మేడారంలో పది తరాలకు సరిపడ అభివృద్ధి చేస్తామన్నారు. దీక్షతో, బాధ్యతతో జాతరనాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడిపై రాజకీయాలు చేయొద్దని హితవుపలికారు. గతంలో వేసిన షెడ్లను తొలగించి పక్కకు పెట్టామన్నారు. మేడారంలో ఎలాంటి ప్రతిమలు లేకపోయినా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారన్నారు. సమ్మక్క – సారలమ్మ ఆదివాసీల అస్థిత్వానికి సంకేతమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే

- ఇరు పార్టీల పాలనలో నల్లగొండకు అన్యాయం
- కృష్ణాజలాలు అందించడంలో రెండు ప్రభుత్వాలు విఫలం
- ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించలేక పోయారు
- జాగృతి జనం బాటలో కవిత ఘాటు విమర్శలు



**నల్లగొండ, నవంబర్ 12:** తెలంగాణ వచ్చాక కూడా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలు అందలేదని నల్లగొండ జిల్లా కేంద్రంలో కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించడంలో విఫలం అయ్యాయి. ప్రభుత్వాలను అడిగేందుకు, నిలదీసేందుకే జాగృతి జనం బాట చేపట్టామన్నారు. జాగృతి జనం బాట'లో భాగంగా నల్లగొండ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలో తన ఫ్లెక్సీలను తొలగించడంపై స్పందించారు. ఫ్లెక్సీలు తొలగించడానికి కవిత తప్పు పట్టారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మంత్రి అనుకున్నా అని విమర్శించారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే.. ఫ్లెక్సీలు తొలగిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తాను ప్రస్తావిస్తున్నా అని, చేతనైతే ప్రభుత్వం సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. నల్లగొండకు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో ఆమె అభిమానులు కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కటౌట్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించింది? 'సుంకిశాల లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరగాలి. నాగార్జునసాగర్ ఎడమ కాలువను రాష్ట్ర ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకోవాలి. కృష్ణా జలాలను నల్లగొండకు తీసుకురాకపోతే.. భూ నిర్వాసితులతో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తాం' అని అన్నారు. 'బీఆర్ఎస్‌ను తిట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయినా కూడా కాంగ్రెస్ అదే నిర్లక్ష్యం చేస్తుంది. సీఎం ఆదేశాలను కలెక్టర్‌లు పట్టించుకోవడం లేదు. మా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎపిడ్యూరల్ మెడిసిన్ అందివ్వకపోవడం బాధ అనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎపిడ్యూరల్ మెడిసిన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం భూదాన్ భూములను స్వాధీనం చేసుకోవాలి. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారో సీఎం చెప్పాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కవిత విమర్శించారు.గత 12 ఏళ్లలో పూర్తి స్థాయిలో జిల్లాకు కృష్ణా జలాలు అందాయో లేదో ఆలోచించాలని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట అనలేదని.. ప్రాజెక్టుల పరిశీలనలో తాము వెళ్తే నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారన్నారు. ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. నల్గొండ జీజీహెచ్ మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవన్నారు. ఐసీయూలో ఒక్కో బెడ్‌కు ఇద్దరిని పడుకోబెడుతున్నారని తెలిపారు. ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు లేకపోవడం బాధాకరమని కవిత అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఎప్పుడు పూర్తి అవుతుందని ప్రశ్నించారు. భూదాన్ భూములు ఎందుకు వెనక్కి తీసుకోలేదని నిలదీశారు. నాగార్జున సాగర్ రైట్ బ్యాంక్ ఏపీ చేతిలో ఉందని.. లెఫ్ట్ బ్యాంక్ పూర్తిగా సెంట్రల్ చేతులో పెట్టారన్నారు. సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని... అందుకోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. 20 శాతం తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడుతోన్న నిబంధనలను సడలించాలన్నారు. కాగా.. నల్గొండ పట్టణంలో పర్యటించిన కవిత.. .జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అయితే కవిత పర్యటన నేపథ్యంలో నల్గొండలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను జాగృతి నాయకులు ఏర్పాటు చేశారు. కానీ రాత్రికి రాత్రే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీనిపై కవిత స్పందిస్తూ.. నల్గొండలో కోమటిరెడ్డికి తనకు పంచాయతీ లేదని.. కానీ తన ఫ్లెక్సీలు తొలగించారని మండిపడ్డారు. అరెస్టు చేసిన జాగృతి నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించేందుకు నల్గొండ వచ్చానని... పాలిటిక్స్ చేసేటప్పుడు గట్టి వాళ్లనే జాగృతి పోటీలో నిలబెడుతోందని అన్నారు. జాగృతి నాయకులతో పెట్టుకున్నోళ్లు బాగుపడలేదని కవిత వ్యాఖ్యలు చేశారు.

# హైదరాబాద్‌లో పోలీసుల తనిఖీలు

- రద్దీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సోదాలు
- పేలుడు ఘటనతో దేశవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తం



**హైదరాబాద్, నవంబర్ 12:** దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ఘటనతో దేశవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. బుధవారం దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లోని ఎయిర్ పోర్టులను పేల్చివేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. ఆ జాబితాలో హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ సైతం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. అందులో భాగంగా బస్ స్టాప్‌లు, దేవాలయాలు, షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రాంతాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఇక బాలా నగర్ పీఎస్ పరిధిలోని పలు షాపింగ్ మాల్స్, టెంపుల్స్, బస్ స్టాప్‌లలోనూ పోలీసులు తనిఖీలు చేపట్టారు.అలాగే పబ్లిక్ ప్లేసెస్ వద్ద బాంబ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. దీంతో రహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రద్దీ వేళ.. ఈ సోదాల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌లు పేల్చేస్తామంటూ ఇండిగో ఎయిర్ లైన్స్ కార్యాలయానికి ఈ మెయిల్ అందింది. ఈ ఎయిర్ లైన్స్ అధికారులు వెంటనే ఎయిర్ పోర్ట్ ఉన్నతాధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఐదు ఎయిర్‌పోర్ట్‌ల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టాయి. ఆ క్రమంలో ఆయా ఎయిర్ పోర్టుల్లోని ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అయితే సోమవారం అంటే.. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 12 మంది మరణించారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. చాలా కాలం తర్వాత బాంబు పేలుడు సంభవించడం.. అదికూడా న్యూఢిల్లీలో కావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమైంది. ఈ బాంబు పేలుడు వెనుక ఎవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు జరుగుతుంది. అలాగే ఈ పేలుడు ఘటనలో అనుమానిత కారును ఫరీదాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ఖండవాలి గ్రామం వద్ద పార్క్ చేసిన కారును గుర్తించారు. అనుమానిత కారు నెంబర్ ఆఇ 10 అఐ 0458గా గుర్తించారు. డాక్టర్ ఉమర్ పేరుపై ఈ ఎకో స్పోర్ట్స్ కారు రిజిస్టర్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. ఈ బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు.

# సీఐడీ విచారణకు ప్రకాశ్ రాజ్ హాజరు

## బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని పిలుపు




**హైదరాబాద్, నవంబర్ 12:** బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే హీరో విజయ్ దేవర కొండను విచారించిన సీఐడీ.. బుధవారం మరో నటుడు ప్రకాశ్ రాజ్ ను ప్రశ్నించింది. ప్రకాశ్ రాజ్ రెండోసారి బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ ముందుకు విచారణకు వచ్చాడు. ఇందులో సీఐడీ అనేక ప్రశ్నలు వేసింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కంటెంట్ ఎలా వచ్చింది, డబ్బులు ఎవరు ఇచ్చారు, ఎలా ఇచ్చారు, వాటిని ఏం చేశారు అనే కోణంలో అధికారులు ప్రశ్నించారు. దీనిపై ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ.. తాను 2016లో జంగిల్ రమ్మీ యాప్‌ను ప్రమోట్ చేశానని.. 2017లో బెట్టింగ్ యాప్స్ నిషేధిస్తూ చట్టం తెచ్చిన తర్వాత ప్రమోట్ చేయడం ఆపేశానంటూ తెలిపాడు. బెట్టింగ్ యాప్స్ వల్ల ఇంత మంది ఎఫెక్ట్ అవుతారని అప్పుడు తనకు అవగాహన లేక చేశానని.. తెలిసిన తర్వాత ఎవరూ వాటి జోలికి వెళ్లొద్దని జూనియర్లకు చెబుతున్నట్టు ప్రకాశ్ రాజ్ వెల్లడించాడు. విచారణ అనంతరం ప్రకాశ్ రాజ్ మీడియాతో మాట్లాడారు. తెలిసి చేసినా.. తెలియక చేసినా తప్పే కాబట్టి దీనిపై నేను క్షమాపణ కోరుతున్నా. సిట్ అధికారులకు దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, డాక్యుమెంట్స్, బ్యాంకు లావాదేవీలు అందజేశా. ఎంతోమంది యువత బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోతున్నారు. వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు చేయనని ప్రకాశ్ రాజ్ తెలిపారు. బెట్టింగ్ యాప్‌లకు సినీతారలు, సెలబ్రిటీలు ప్రచారం కల్పించడంతో పలువురు యువకులు వాటికి బానిసలై ప్రాణాలు పోగొట్టుకున్నారంటూ పలు ఠాణాల్లో కేసులు నమోదవడంతో వాటి విచారణకు సీఐడీ అదనపు డీజీపీ నేతృత్వంలో ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆయా కేసుల్లో విజయ్‌తోపాటు సినీనటులు రాణా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి సహా మొత్తం 29 మంది నిందితులుగా ఉన్నారు. త్వరలోనే మంచు లక్ష్మి, రానా కూడా సీఐడీ విచారణకు రాబోతున్నట్టు తెలుస్తోంది.

# కేబినేట్ సమావేశం 15కు వాయిదా

**హైదరాబాద్, నవంబర్ 12:** బుధవారం జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 15వ తేదీకి వాయిదా పడింది. శనివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ మంత్రివర్గ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. వాస్తవానికి తెలంగాణ కేబినెట్ సమావేశం ఈ నెల 7వ తేదీన జరగాల్సి ఉండే. కానీ సమావేశాన్ని 12వ తేదీకి వాయిదా వేశారు. మళ్లీ ఇవాళ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఫలితం తేలిన మరుసటి రోజున కేబినెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్,నవంబర్12:** రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఎల్ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అధికారులు గైడ్‌లైన్స్ విడుదల చేశారు. కన్వీనర్ కోటాలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోని వారు సైతం స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లు పూర్తిగా మెరిట్ ఆధారంగానే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేస్తామన్నారు. కాలేజ్ లింక్ ద్వారా స్పాట్ రిజిస్ట్రేషన్లను 17వ తేదీ వరకు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల కేటాయింపును 18న విడుదల చేస్తామని, 19వ తేదీ మధ్యాహ్నం పన్నెండుగంటల్లోపు సంబంధిత కళాశాలల్లో సీట్లు పొందిన అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.



# బాంబు పేలుళ్లపై విమర్శలు అర్థరహితం

పేలుళ్లతో బీజేపీకీ ఏం సంబంధం.. ● మెదక్ ఎంపీ రఘునందన్ రావు

## సోషల్ మీడియా విమర్శలపై ఆగ్రహం

**సంగారెడ్డి, నవంబర్ 12:** ఢిల్లీ ఎర్రకోట బాంబు పేలుళ్ల ఘటనని పలువురు ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వానికి పలువురు సోషల్ మీడియా వేదికగా మద్దతు తెలుపుతున్నారు. అయితే పేలుళ్ల ఘటనలో ఎవరున్నా వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మొత్తం 12 మంది చనిపోయారు. అయితే, ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో బీజేపీ ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలోని ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు 'సర్దార్ – ఏక్తా' పాదయాత్ర జరిగింది. ఈ పాదయాత్రలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. బాంబు పేలుళ్లతో బీజేపీకీ ఏం సంబంధమని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికలు వస్తే బ్లాస్టులు జరుగుతున్నాయని కొంతమంది సోషల్ మీడియాలో నీచంగా మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకంటే దేశద్రోహం ఇంకొక్కటి ఉండదని స్పష్టం చేశారు. పేలుళ్లకు కారణమైన వారి వెనుక బీజేపీ హస్తం ఉందని ఎవరైతే నీచంగా మాట్లాడుతున్నారో.. ఈ విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని హితవు పలికారు. అలాంటి వ్యక్తులను ఎవరూ సమర్థించవద్దని సూచించారు. చేతిలో ఫోన్ ఉందని కొంతమంది ఇష్టం వచ్చినట్లుగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. బాంబులు పేల్చాలని ఓ వర్గం వాళ్లు కుట్ర పన్నారని రఘునందన్‌రావు ఆరోపించారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ తనిఖీలు

## 3కోట్ల ఎలక్ట్రానిక్ పరికరాలు పట్టివేత




**హైదరాబాద్,నవంబర్12:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలు పట్టుబడటం కలకలం రేపింది. అబుదాబీ నుండి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద సుమారు రూ.3 కోట్ల విలువైన వస్తువులను సెంట్రల్ ఇండిస్టియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉండే శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అబుదాబీ నుండి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో సీఐఎస్ఎఫ్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి లగేజీ బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, పెద్ద సంఖ్యలో డ్రోన్లు, ఎలక్ట్రానిక్ స్మార్ట్ వాచ్‌లు, ఖరీదైన ఐఫోన్లు బయటపడ్డాయి. స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితులను సూర్య ప్రకాశ్, మహమ్మద్ జాంగిర్‌గా గుర్తించారు. ఇంత పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలాంటి పత్రాలు లేకుండా ఎందుకు తరలిస్తున్నారనే కోణంలో విమానాశ్రయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వస్తువులను ఎక్కడికి తరలించడానికి ప్రయత్నించారు దీని వెనుక ఎవరైనా ఉన్నారా ? అనే వివరాలను రాబట్టే పనిలో అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# దొంగతనం చేస్తూ పట్టుబడ్డ బీటెక్ విద్యార్థి


**సూర్యాపేట, నవంబర్ 12:** ఏపీకి చెందిన ఓ యువకుడు ఈజీ మనీ కోసం తెలంగాణలో చోరీలు చేస్తూ పట్టుబడ్డాడు. అయితే నిందితుడు పోటీ పరీక్షలు రాసినా.. ఉద్యోగం రాకపోవడంతో.. జల్సాలకు అలవాటు పడి చోరీలు చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లాలోని వేపల సింగారంలో చోరీ చేసి పారిపోతుండగా.. పోలీసులు పట్టుకున్నారు. ప్రస్తుతం నిందితుడిని పీఎస్‌కు తరలించారు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయినప్పటికి ఉద్యోగం రాలేదు. దీంతో జల్సాలు, ఈజీ మనీ కోసం చోరీలు చేస్తున్నాడు. అయితే దొంగతనం చేసిన సొమ్ముతో బెట్టింగ్ ఆడి.. డబ్బులు పోగొట్టుకునేవాడు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో దొంగతనానికి పాల్పడ్డాడు. గ్రామంలోని ముడెం గోపిరెడ్డి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన మల్లికార్జున్ రెడ్డి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ.90 వేల నగదు దొంగిలించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న హుజూర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ చేసిన సొమ్మును అమ్మేందుకు వెళుతుండగా.. అక్కడే వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో మల్లికార్జున్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని ప్రొద్దుటూరు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అమీనాబాద్‌లో తాళాలు వేసిన ఇళ్లను టా÷–గ్గ÷ట్ చేసి నగదు, బంగారాన్ని దొంగిలించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం నిందితుడి నుంచి 51.78 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,85,000 నగదు, బైక్, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.



సంపాదకీయం

# ఉగ్రమూకల ఏరివేత తక్షణ కర్తవ్యం!

ఉగ్రవాదులను అణచివేయడంలో కఠినంగా వ్యవహరించాల్సిందే. అలాంటి వారిని ఏరిపారేయాల్సిందే. ఇంతకాలం పాక్ నుంచి ఉగ్రవాదులు వచ్చి దాడులు చేస్తూ ఉండేవారు. సరిహద్దుగుండా వచ్చి దాడులకు తెగించేవారు. తాజాగా ఢిల్లీ ఎర్రకోట ఘటనతో ఇక్కడి వారినే ఎంపిక చేసుకుని శిక్షణ ఇస్తున్నట్లుగా తేలిపోయింది. ఇలాంటి ఉగ్రవాద సంస్థలను గుర్తించి వాటిని లేపేయాలి. అలాగే ఇక్కడ ఉగ్రవాదులుగా తయారవుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని ఖండఖండాలుగా నరికి కాకులకు గద్దలకు వేయాలి. అమయాకుల ప్రాణాలు తీస్తున్న వారు ఎవరైనా నడిరోడ్డుపై ఉరితీయాల్సిందే. ఎందుకంటే ఎర్రకోట పేలుడు ఘటనతో పాటు, ఫరీదాబాద్ వ్యవహారంలో మనదేశానికి చెందిన వారే ఉండడం, అందులో ఓ లేడీ డాక్టర్ కూడా ఉండడం ఆందోళన కలిగించే విషయం. పాక్‌లోని ఉగ్రమూకలకు నాయకత్వం వహిస్తున్న వారు ఇక్కడి వారిని ఇస్లామిక్ టెర్రరిజంలోకి లాగి విధ్వంస రచన చేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి అంతమొందించాల్సిందే. ఇక్కడ చట్టం ముందు నిలబెడతామంటే కదురదు. ఇలాంటి వారికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి వెనువెంటనే ఉరితీతలు అమలు చేయాలి. అప్పుడే ఉగ్రమూకల్లో చేరాలనుకునే వారికి భయం కలుగుతుంది. పహల్గామ్ హత్యాకాండ తరవాత పాక్‌పై దాడి చేసి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసినా వారిలో మార్పు కానరావడం లేదు. సరికదా మరింతగా రెచ్చి పోతున్నారనడానికి తాజా ఎర్రకోట పేలుడు ఘటనను చూడాలి. ఢిల్లీలో చోటుచేసుకున్న ఈ దురాగతం వెనుక కశ్మీర్ నుంచి వచ్చిన ఉగ్రవాదుల హస్తం ఉన్నదని తేలింది. ఈ ఉగ్రవాద సంఘటన సాయంత్రం జరిగితే ఆ సమయానికి కొద్ది గంటలముందే ఢిల్లీ సరిహద్దుల్లోని ఫరీదాబాద్‌లో రెండు ఇళ్లపై భద్రతాబలగాలు దాడి చేసి అక్కడ 2900 కిలోల పేలుడు సామగ్రి, రైఫిళ్లు, పిస్టళ్లు స్వాధీనం చేసుకు న్నాయి. ఈ రెండు సంఘటనల వెనుక పాకిస్థాన్‌లో ఉన్న అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలు జైషే మహమ్మద్, అన్సర్ ఘజ్వవత్ ఉల్ హింద్ ప్రమేయం ఉన్నదని తేలింది. అయితే ఇందులో కశ్మీర్‌కు చెందిన విద్యాధికులైన వైద్యులు ఉగ్రవాదులుగా ప్రత్యక్షమయ్యారని హోంశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం. ఈ క్రమంలో ఆపరేషన్ కగార్ లాంటిదే కశ్మీర్‌లో చేపట్టాలి. నిరంతరం అక్కడ ఇల్లిల్లూ గాలించాలి. నిఘా పెంచాలి. 1999లో భారత విమానం హైజాక్‌కు గురైన తర్వాత భారత్ విడుదల చేసిన ఉగ్రవాది మసూద్ అజర్ స్థాపించిన సంస్థే జైషే మహమ్మద్ ద్వారా మసూద్ అజర్ పాకిస్థాన్ నుంచి భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉన్నాడు. 2001లో పార్లమెంటు పైన, 2019లో పుల్వామాలో సైనికులు ప్రయాణిస్తున్న బస్సుపైన దాడుల వెనుక మసూద్ హస్తం ఉన్నది. అతడి ఉగ్రవాద చర్యల పాక్ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోంది. ఇప్పుడు ఆయన సోదరి సదియా సైతం మహిళా విభాగాన్ని నెలకొల్పి ఉగ్రవాద మహిళలను మన దేశంలో ప్రవేశపెట్టిందని వార్తలు వస్తున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణ మనవద్ద ఓ మహిళా డాక్టర్ పట్టుబడడమే. అంతేగాకుండా ఉగ్రవా చర్యలకు ఆమె విరాళాలు సేకరించడం కూడా ఆందోళన కలిగిస్తోంది. పహల్గామ్ సంఘటన తర్వాత కూడా జమ్మూ కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయనడానికి తాజా ఘటనే నిదర్శనం. కాశ్మీర్ నుంచి ఉగ్రవాదులు పేలుడు సామగ్రిని భారీ ఎత్తున సరఫరా చేయగలుగుతున్నారని ఎర్రకోట, ఫరీదాబాద్ సంఘటనలు నిరూపిస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ చేశారు. అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సందేశం పంపారు. దేశ వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లలో తనిఖీలు కూడా ప్రారంభ మయ్యాయి. మన భద్రతా దళాలు గతంలో కంటే ఎక్కువగా గూఢచార సమాచారం సేకరించి అనేక మంది ఉగ్రవాదులను హతమార్చి, ఎన్నో దాడులు చేస్తూనే ఉన్నాయి. అయినా ఉగ్రమూకులు చెలరేగిపోతూనే ఉన్నాయి. ఈ ఘటన తరవాత ఎవర్నీ వదిలి పెట్టబోమని భూటాన్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి మోడీ ప్రకటించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అత్యసవర సమీక్షలు చేసి గట్టిగానే హెచ్చరికలు చేశారు. మంగళవారం ఉదయం నుంచి అమిత్ షా, ఎన్ఐఏ అధికారులు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశాలు నిర్వహించారు. ఉగ్రవాద దాడుల్లో సైనికులు, ప్రజలు మరణించినప్పుడల్లా ఇలాంటి భద్రతా సమావేశాలు జరుగుతూనే ఉంటాయి. ఉగ్రవాదుల్ని వదిలిపెట్టబోమని మన నేతలు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంటారు. అయితే భారత్‌లో పాక్ ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయడంలో ఎలాంటి మీనమేషాలు లెక్కించరాదని ప్రజలు కోరుకుంటున్నారు. పాక్‌పై గతంలో ఆపరేషన్ సిందూర్ అర్థంతరంగా నిలిపి వేయడంపైనా ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అయ్యింది. పహల్గామ్ సంఘటన తర్వాత భారత పాకిస్తాన్‌ల మధ్య నాలుగు రోజుల పాటు యుద్ధం లాంటి దాడి జరిగింది. యుద్ధం తీవ్రమవుతున్న దశలో అనూహ్యం గా కాల్పుల విరమణ జరిగింది. కాల్పుల విరమణ తర్వాత ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి అత్యంత కీలకమైన ప్రకటన ఒకటి చేశారు. 'భారతదేశం తన సైనిక చర్యను కేవలం తాత్కాలికంగా నిలిపివేసింది. భవిష్యత్‌లో పాకిస్తాన్ ఎటువంటి దాడి చేసినా భారత్ తిరిగి తీవ్రమైన ప్రతీకారం తీర్చుకుంటుంది. ఎవరి ప్రమేయం లేకుండా భారత్ స్వంత నిర్ణయం తీసుకుని పాక్‌కు బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. అణు హెచ్చరికలతో బెదరించలేరని కూడా అన్నారు. తాజాగా రాజధాని ఢిల్లీలోనే పాక్ ప్రేరిత ఉగ్రవాదులు దాడులు చేశారు. కాబట్టి ఎలాంటి చర్యలు ఉంటాయన్న విషయంలో ప్రజల్లో చర్చ సాగుతోంది. అందువల్ల ఉగ్రవాదులకు బుద్ధి చెప్పే విషయంలో కఠిన వైఖరితోనే ఉండాలి. భారత్ గడ్డపై ఉగ్రవాద చర్యలకు పాల్పడితే అంతే సంగతులు అన్న హెచ్చరిక ఉండాలి. భారత్‌తో పెట్టుకోలేమని గట్టిగా బుద్ధి చెబితే తప్ప ఈ రాక్షసకాండ ఆగదు. పాక్ విసయంలో మనం నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇస్లామిక్ తీవ్రవాదంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందే.




# ఢిల్లీ చేరుకున్న ప్రధాని మోడీ

ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఢిల్లీ పేలుడు ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారంనాడు పరామర్శించారు. రెండ్రోజుల భూటాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ప్రధాని ఆ వెంటనే లోక్‌నాయక్ జయప్రకాష్ ఆసుపత్రికి వెళ్లారు. బాధితులతో నేరుగా మాట్లాడి త్వరగా కోలుకోవాలని అభిలషించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడారు. బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాని రాక కోసం ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద మీడియా వేచి ఉండటంతో ఆయన ఆసుపత్రిలో వెనుక వైపునున్న ప్రత్యేక గేటు ద్వారా లోపలకు వెళ్లారు. ఢిల్లీలో పేలుడుకు బాధ్యులైన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, వారిని చట్టం ముందు ఉంచుతామని పేలుడు ఘటన అనంతరం మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీ పేలుడు దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఆసపత్రికి చేరుకున్న వెంటనే చికిత్స పొందుతున్న వారిని నేరుగా పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు.









# ఆత్మాహుతి దాడిలో మరో కారు

గుర్తించిన కారు కోసం గాలింపు

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఎర్రకోట దగ్గర పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరమైంది. ఈ ఆత్మాహుతి దాడి ఘటనలో ముష్కరులు మరో కారును కూడా ఉపయోగించినట్టు నిఘా సంస్థలు కనిపెట్టాయి. వీరు ఉపయోగించినట్టు భావిస్తున్న ఎరుపురంగు ఎకోస్పోర్ట్ కారు కోసం పోలీసులు ప్రస్తుతం గాలిస్తున్నారు. ఈ కారు డాక్టర్ ఉమర్ పేరుతో రిజిస్టర్ అయిందని, కారు నెంబర్ డిఎల్ 10సికె 0458 అని నిఘా సంస్థలు గుర్తించాయి. దీంతో అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ పోస్టులు, బోర్డర్ చెక్‌పాయింట్లను పోలీసులు అప్రమత్తం చేశారు. ఢిల్లీ పేలుడు ఘటనతో సంబంధం ఉన్న జైష్ మాడ్యూల్ నుంచి పోలీసులు రాబట్టిన సమాచారం ప్రకారం టెర్రర్ ఆపరేటివ్స్ అయిన డాక్టర్ ఉమర్, అమీర్‌లు ఢిల్లీ నుంచి మరో రెండు కార్లు సేకరించినట్టు బయటపడింది. ఉగ్ర కుట్రలో ఈ కార్లను ఉపయోగించినట్టు అనుమానిస్తున్నారు.

# వరుస దాడులతో ఉక్కిరి బిక్కిరి

ఒత్తిడి తట్టుకోలేకే ఎర్రకోట వద్ద పేలుళ్లు

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ–ఎన్సీఆర్, జమ్మూకశ్మీర్ పుల్వామాలోని పలు ప్రాంతాలలో భద్రతా సంస్థలు ఇటీవల దాడులు జరిపి భారీఎత్తున పేలుడు పదార్థాలను పట్టుకున్నాయి. దీంతో ఉగ్రవాదుల్లో ఒత్తిడి మరింత అధికమైంది. ఈ ఒత్తిడిని ఎదుర్కోలేకనే అనుమానితుడు తొందరపడి బ్లాస్టర్ చేశారని అధికారులు వెల్లడించారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో దాదాపు 3000 కిలోల పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, టైమర్లు సహా పలు బాంబు తయారీ సామగ్రినీ స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సంస్థలు వాటిని పట్టుకోవడానికి జరిపిన దాడుల కారణంగా భయాందోళన, నిరాశ కారణంగా పేలుడు సంభవించిందని నిఘా వర్గాలు ప్రాథమికంగా అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో బాంబును పూర్తిగా తయారు చేయకుండానే పేలుడుకు పాల్పడినట్టు నిర్ధారణ అవుతోంది. అయితే.. ఈ ఘటనలో పేలుడులో వినియోగించిన పదార్థాలేవో ఇంకా గుర్తించలేదని పోలీసులు తెలిపారు. అనుమానిత మాడ్యూళ్లపై నిఘా వర్గాలు దృష్టి సారించి అరెస్ట్ చేయడం వల్ల ఓ పెద్ద పెను ప్రమాదం తప్పిందంటూ అంచనా వేశారు.

# మా సోదరుడు అమాయకుడు

ఎవరో అతడిని ఉగ్రకుట్రలో ఇరికించారు

డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ సోదరుడి వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 12:** దేశంలో పెను విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఏటీఎస్ పోలీసులు ఆదివారం గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేసారు. మొహియుద్దీన్ అరెస్టుపై కుటుంబ సభ్యులు స్పందించారు. మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ ఫారూఖీ మాట్లాడుతూ.. తన సోదరుడు మంచోడని, ఎవరో కావాలనే కుట్రలో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన సోదరుడికి ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు తెలియదని చెప్పాడు. ఒకవేళ తమ సోదరుడు తప్పు చేస్తే కఠినంగా శిక్షించండని ఒమర్ ఫారూఖీ అన్నాడు. చార్మినార్‌లోని రెహమానియా మదర్సాలో మౌలనాగా పనిచేస్తున్న ఒమర్ ఫారూఖీ మాట్లాడుతూ 'మా సోదరుడు మొహియుద్దీన్ ఎవరో ట్రాప్ చేసి ఈ కుట్రలో ఇరికించారు. మా బ్రదర్‌కు ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు మాకు తెలియదు. 9న ఏటీఎస్ వారు నాకు ఫోన్ చేసి మీ సోదరుడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని, అరెస్ట్ చేశాం అని చెప్పారు. మొహియుద్దీన్ నివాసాన్ని ముట్టొద్దు, 2 రోజుల్లో వచ్చి ఆయన రూమ్‌లో ఉన్న సామగ్రి స్వాధీనం చేసుకుంటాం అని ఏటీఎస్ పోలీస్ చెప్పారు. ఇంటికి ఏటీఎస్ పోలీసులు వచ్చారు, సామాన్లు సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏటీఎస్ అరెస్టు చేసినవారిలో మరో ఇద్దరు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహైల్ వారితో మాకు ఎలాంటి లింక్స్ లేవు' అని అన్నాడు. మొహియుద్దీన్ ఫోన్లో లొకేషన్ ఆఫ్ చేసి, చాటింగ్ టెలిగ్రామ్ ద్వారా మాత్రమే ఇదంతా చేశాడా అన్నది మాకు తెలియదు. ఇంట్లోనే రెసిన్ తయారీ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు ఏటీఎస్ పోలీస్ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా మొయి నుద్దీన్ తిరిగిన మార్గాలపై పోలీస్ ఫోకస్ పెట్టారేమో. కేంద్రం పూర్తి విచారణ జరపాలన్నాడు.

# పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు

29న కారును కొన్న డాక్టర్ నబీ.. 11 రోజులుగా అండర్ గ్రౌండ్‌లో కారు

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** దిల్లీ పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఎర్రకోటకు అతి సమీపంలో పేలిన ఐ20 కారును డాక్టర్ ఉమర్ నబీ.. బ్లాస్ట్‌కు పది రోజుల ముందు కొనుగోలు చేశాడని దర్యాప్తు చేస్తున్న వర్గాలు వెల్లడించాయి. అక్టోబర్ 29న దానిని కొనుగోలు చేసిన అతడు.. వెంటనే దానికి కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాన్ని తీసుకున్నాడు. ఆ తర్వాత అతడు అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయాడని, అప్పటినుంచి కారు ఎక్కడ ఉందో కచ్చితంగా తెలియడం లేదు. సోషల్ మీడియాలో మాత్రం అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం వద్ద ఉన్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఫరీదాబాద్ పోలీసుల వాదన దీనికి భిన్నంగా ఉంది. కారు గత 10-11 రోజులుగా అక్కడలేదని వారు చెబుతున్నారు. ఇక కాలుష్య నియంత్రణ ధ్రువీకరణపత్రం తీసుకునే సమయంలో ముగ్గురు వ్యక్తులు కారు నుంచి బయటకు వచ్చారు. వారు ఎవరనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు, వరుసగా తన సహచరులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆందోళనకు గురైన ఉమర్ నవంబర్ 10న ఆ కారు తీసుకొని, దిల్లీ వైపు వెళ్లాడని ఆ వర్గాలు పేర్కొన్నాయి. జాతీయ దర్యాప్తు సంస్థ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నాయి. దీనిలో భాగంగా కారు యజమాని సల్మాన్‌ను గురుగ్రామ్‌లో ఇప్పటికే అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. 2014, మార్చి 18న సల్మాన్ పేరిట దీనిని కొనుగోలు చేశారు. తర్వాత అతడు దానిని దేవేంద్ర అనే వ్యక్తికి అమ్మేశాడు. అనంతరం సోనుకు.. అక్కడి నుంచి పుల్వామాకు చెందిన తారిక్ చేతికి చేరింది. ఈ వాహనం పలువురు చేతులు మారినా.. యాజమాన్య బదిలీకి సంబంధించి ప్రభుత్వం వద్ద ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకపోవడం గమనార్హం. కొనుగోళ్లు, విక్రయాల సమయంలో నకిలీ పత్రాలను ఉపయోగించారని తెలుస్తోంది.

# 26/11 ముంబై దాడుల తరహా పేలుళ్లకు కుట్ర

- భారీగా పేలుడు పదార్థాలు సిద్ధం చేస్తున్న ఉగ్రవాదులు
- ఢిల్లీ ఎర్రకోట పేలుడుతో తవ్వుతున్నకొద్దీ పలు విషయాలు వెల్లడి

**న్యూఢిల్లీ, నవంబర్ 12:** ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు కొనసాగుతోంది. దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పేలుడుకు కారణమైన వైద్యుల టెర్రర్ మాడ్యూల్ వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దిల్లీలో వరుస పేలుళ్ల కోసం ఉగ్రవాదులు జనవరి నుంచి పథక రచన చేస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. 26/11 ముంబయి దాడుల తరహాలో దేశ రాజధానిలో వరుస పేలుళ్లకు ఉగ్రవాదులు కుట్ర పన్నినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరి టార్గెట్ లిస్ట్‌లో ఎర్రకోటతో పాటు ఇండియా గేట్ వంటి ఇతర ప్రముఖ కట్టడాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇందుకోసం భారీగా బాంబులను కూడా తయారుచేస్తున్నట్లు పేర్కొన్నాయి. దిల్లీ పేలుడు కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఇందుకోసం 10 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. జమ్మూకశ్మీర్, దిల్లీ, హరియాణా పోలీసుల నుంచి కేసు డైరీలను తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతోంది. నిందితుల కార్యకలాపాలు, వారికి



అందిన ఆర్థిక సహకారం గురించి ఆరా తీస్తోంది. ఇందులోభాగంగానే పలు అనుమానితులు, నిందితులను విచారించి వారి నుంచి కూపీ లాగుతున్నారు. ఈ టెర్రర్ మాడ్యూల్ అత్యంత శక్తిమంతమైన 200 ఐఈడీలను సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం సహా దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్ వద్ద పేలుళ్లకు పాల్పడాలని వీరు కుట్ర పన్నుతున్నట్లు తెలిపాయి. ఈ టెర్రర్ మాడ్యూల్‌పై ఇటీవల జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక, దిల్లీలో పేలుడు జరిగిన ప్రాంతం నుంచి 40 నమూనాలను ఫోరెన్సిక్ అధికారులు సేకరించారు. ఇందులో కూడా అమ్మోనియం నైట్రేట్ ఆనవాళ్లతో పాటు అత్యంత శక్తిమంతమైన మరో పేలుడు పదార్థం కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

# పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తాం

మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రసంగించిన సీఎం చంద్రబాబు ఇళ్లు లేని పేదల పేర్లు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కుటుంబాలను కలిపేందుకు పక్కపక్కనే రెండు ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఇంటిపై సోలార్ పెట్టుకునేలా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ఇళ్లపై, పొలాల్లో కరెంట్ తయారు చేయిస్తున్నామని వివరించారు. సోలార్, విండ్, వాటర్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. బుధవారం అన్నమయ్య జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఒక్కరోజే రాష్ట్రంలో మూడులక్షల ఇళ్లకు గృహప్రవేశాలు చేయిస్తున్నామని వివరించారు. మిగిలిన ఇళ్లు కూడా వేగంగా పూర్తి చేసి త్వరలోనే అప్పగిస్తామని స్పష్టం చేశారు. నిన్న(మంగళవారం) కనిగిరిలో 97 పరిశ్రమలు ప్రారంభించామని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఓ÷ూఓఇ పార్కులు ఏర్పాటు చేస్తామని ఉద్ఘాటించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. 2029 నాటికి పేదలకి సొంతిల్లు ఉండాలనేది తన లక్ష్యమని నొక్కిచెప్పారు. ఇళ్లు అంటే నాలుగు గోడలు కాదని.. భవిష్యత్‌కు భద్రత అని అభివర్ణించారు. జగన్‌పై సీఎం చంద్రబాబు షాకింగ్ కామెంట్స్ చేశారు. జగన్‌రెడ్డి ఐదేళ్లలో ఏపీని నాశనం చేశారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిందని విమర్శించారు. ఏపీని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ నిధులను కూడా జగన్ పక్కదారి పట్టించారని దుయ్యబట్టారు. కేంద్ర పథకాల్లో రాష్ట్ర వాటా ఇవ్వకుంటే ఏపీకే నష్టమని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వాటా ఇవ్వక చాలా



నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో 4.73 లక్షల ఇళ్లను రద్దు చేశారని మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణ వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించారని ÷ర్ అయ్యారు. వైసీపీ పాలనలో నివాస యోగ్యం కాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని ఆరోపించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే ఇసుకలోనూ జగన్, ఆయన అనుచరులు దోచుకున్నారని ఆక్షేపించారు. ముస్లింలకు కూడా అందరితో సమానంగా ఇళ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి 5.90 లక్షల గృహప్రవేశాలు చేయిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సీఐఐ సదస్సు కోసం విశాఖ సిద్ధం

## సర్వాంగ సుందరంగా ముస్తాబైన వైజాగ్


## విశాఖకు చేరుకున్న సీఎం చంద్రబాబు

**విశాఖపట్టణం :** రెండ్రోజుల పాటు జరిగే సిఐఐ సదస్సుతో విశాఖ నగరం కొత్త శోభను సంతరించుకుంది. భాగస్వామ్య సదస్సు కోసం వచ్చే ప్రతినిధుల కోసం ఇప్పటికే హోటల్ గదులు సిద్ధం చేశారు. విదేశీ అతిథులు ప్రత్యేకంగా బస చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గూగుల్ డేటా సెంటర్ రాక సూచికగా వైజాగ్‌లో చివరి జి అక్షరం పెద్దగా గూగుల్ ఫాంట్‌తో ప్రతి దగ్గర దర్శనమిస్తూ అందరిని అకట్టుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు కోసం నగరం ముస్తాబైంది. విశాఖలోని ప్రధాన మార్గాలన్నీ విద్యుత్తు దీప కాంతులతో కొత్తదనాన్ని సంతరించుకున్నాయి. కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆకర్షణీయ ఫౌంటెన్‌లు, ఇతర అలంకరణ వస్తువులు కనువిందు చేస్తున్నాయి. విద్యుద్దీపాలలో బీచ్ రోడ్ అంతా మెరుస్తోంది. ఈ నెల 14, 15 తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ మైదానంలో జరగనున్న ఈ సదస్సుకు ఏర్పాట్లు తది దశకు వచ్చాయి. 40 దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ప్రధాన వేదికతోపాటు, ప్రత్యేక ప్రాంగణాలు సిద్ధం చేస్తున్నారు. సీఎంతోపాటు గవర్నర్, ఉప రాష్ట్రపతి ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉండడంతో భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. సదస్సు నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. అతిథులకు నోవాటెల్ హోటల్‌లో విందు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశ, విదేశాలకు చెందిన రాయబారులు, కాన్సుల్ జనరల్స్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార రంగ ప్రముఖులు, అతిథుల కోసం నగరంలోని 26 హోటళ్లలో 1,200 గదులు సిద్ధం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు పర్యాటక ప్రదేశాలను వీక్షించే అవకాశం ఉండడంతో విందు ఏర్పాటు చేసి, అక్కడ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.

# తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం

**తిరుపతి :** తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ విచారణ కొనసాగుతోంది. వైకాపా హయాంలో తితిదే ఈవోగా పనిచేసిన ఏవీ ధర్మారెడ్డి వరుసగా రెండో రోజూ విచారణకు హాజరయ్యారు. మంగళవారం జరిగిన విచారణలో పలు ఆసక్తికర విషయాలను ఆయన వెల్లడించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మరింత సమాచారం రాబట్టేందుకు రెండో రోజూ ధర్మారెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. మరోవైపు తిరుమల పరకామణి చోరీ ఘటనపై సిట్ విచారణ కొనసాగుతోంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో అధికారులు విచారిస్తున్నారు. రెండోసారి విచారణకు సీఐ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. పరకామణి చోరీ సమయంలో తిరుమల వన్‌టౌన్ పీఎస్‌లో ఆయన పనిచేశారు. విచారణకు పలువురు తితిదే అధికారులు కూడా హాజరయ్యారు. ఇకపోతే టీటీడీ కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కల్తీ నెయ్యి కేసులో టీటీడీ మాజీ అదనపు ఈవో ధర్మా రెడ్డి అప్రూవర్‌గా మారారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో అప్పట్లో ఏం జరిగిందో సవివరంగా సిట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. వైసీపీ పాలనలో టీటీడీ పాలకమండలి చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి ఒత్తిడి వల్లే అవన్నీ జరిగినట్టు అంగీకారించారు. కల్తీపై సీబీఐ సిట్‌కు ధర్మారెడ్డి కీలక సమాచారాన్ని అందించారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో రెండవ రోజు సీబీఐ సిట్ విచారణ కొనసాగుతోంది. తిరుపతి అలిపిరి కేంద్రంలో సిట్ కార్యాలయానికి టీటీడీ మాజీ అదనపు ఈవో ఏవి ధర్మారెడ్డి, బోలెబాబా డైరెక్టర్ విపిన్ జైన్, పామిల్ జైన్ వేరువేరుగా విచారణకు హాజరయ్యారు. విచారణలో ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారి.. ఈ వ్యవహారానికి సంబంధించి అనేక విషయాలను సిట్‌కు తెలియజేసినట్లు తెలుస్తోంది. టీటీడీ పాలకమండలి చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి అప్పట్లో ఈవోగా ఉన్న అనిల్ కుమార్ సింగాల్‌ను ఉపయోగించుకుని కల్తీ నెయ్యికి కారణమైనట్టు ధర్మారెడ్డి బాంబు పేల్చారు.

# తిరుమల శ్రీవారితో వైసీపీ చెలగాటం



**అమరావతి :** వైసీపీ ఐదేళ్ల పాలనలో అఖిలాండ బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంలో జరిగిన పాపం కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని మాజీ మంత్రి దేవినేని ఉమా విమర్శించారు. ఏళ్ల తరబడి ధర్మారెడ్డి.. తాడేపల్లి ప్యాలస్, సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి కనుసన్నల్లో టీటీడీలో పెత్తనం చేశారన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హైకమాండ్ ఒత్తిడితో కల్తీ నెయ్యికి సహకరించానని, సుబ్బారెడ్డికి అంతా తెలిసే కల్తీ జరిగిందని ధర్మారెడ్డి సిట్ విచారణలో వెల్లడించినట్టు అందరూ చూస్తున్నారని తెలిపారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసిన దొంగల్లో ధర్మారెడ్డి దొరికారని... తర్వాత సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి వంతు వస్తుందన్నారు. దేవుడంటే భయం, భక్తి లేని దొంగల ముఠా.. నెయ్యిని ఎలా కల్తీ చేశారో సుప్రీం కోర్టు పరివేక్షణలో సిట్ బయటపెట్టిందన్నారు. రాజశేఖర్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లో వందల కోట్ల భూకబ్జాలు చేసి సీబీఐ, ఈడీ విచారణను ఎదుర్కొంటున్న ఏ6 ముద్దాయి వైవీ సుబ్బారెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. హర్ష్ ఫ్రెష్ ఫుడ్స్, హర్ష్ డెయిరీ పేరుతో భోలే బాబా పామాయిల్, తప్పుడు బిల్లులతో 6.5 లక్షల కిలోల మోనోగ్లిసరైడ్, అసిటిక్ యాసిడ్ ఎస్టర్‌లతో నెయ్యి తయారు చేశారని మండిపడ్డారు. పాలు, వెన్న లేకుండా జగన్మోహన్ రెడ్డి బాబాయి సుబ్బారెడ్డి టన్నుల కొద్దీ నెయ్యి తయారు చేయించారని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్నదానంలో రేషన్ బియ్యం పెట్టి తిరుమల పవిత్రత దెబ్బతీశారని మండిపడ్డారు. ఏళ్లతరబడి శ్రీవారి పరకామణిలో విదేశీ కరెన్సీని కొల్లగొట్టిన కేసులో నిందితుడైన రవికుమార్‌తో రాజీ చేసుకుని అతని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి దొంగలకు పెద్దన్నలాగా జగన్ రెడ్డి నిలిచారంటూ వ్యాఖ్యలు చేశారు. వెంకన్న స్వామితో పెట్టుకున్నారు కాబట్టే చిత్తుగా ఓడి 11 సీట్లకు పడిపోయారని... ఇలాంటి దుర్మార్గులను ఉరి తీసిన పాపం లేదంటూ ÷ర్ అయ్యారు. కలియుగ వెంకన్న స్వామి ప్రసాదాన్ని కల్తీ చేసిందే కాకుండా ఇంకా తప్పుడు వార్తలతో భక్తుల మనోభావాలు దెబ్బతీస్తూ ఇంకా దిగజారుతున్నారన్నారు. ప్రమాదకర రసాయనాలతో తయారైన నెయ్యిని శ్రీవారి ప్రసాదంలో ఉపయోగించి ఇంకా సమర్థించుకుంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారదర్శకత అంటున్న వైసీపీ ముఠా.. అజయ్ సుగంధ్ రిమాండ్ రిపోర్టు అంశాలపై ఏం సమాధానం ఇస్తారని దేవినేని ఉమా ప్రశ్నించారు.

# ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై దృష్టి సారించాలి

## రాయలసీమ స్నాతకోత్సవంలో గవర్నర్ జస్టిస్ నజీర్

**కర్నూలు :** విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో కూడా మార్పు రావాలని ఏపీ గవర్న్ అబ్దుల్ నజీర్ సూచించారు. ముఖ్యంగా సాంకేతికంగా, విజ్ఞానపరంగా జరుగుతున్న అభివృద్ధివైపు, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ పై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కర్నూల్ జిల్లా రాయలసీమ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. స్నాతకోత్సవంలో అధికంగా బాలికలే బంగారు పతకాలు సాధించడం అభినందనీయమని, బాలురు కూడా అత్యధిక సంఖ్యలో బంగారు పతకాలు సాధించి కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. విద్యతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని,వ్యక్తిగత అభివృద్ధికి ఎంతగానో దోహదమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచం సాంకేతికవైపు దూసుకుపోతున్న తరుణంలో వచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఢిల్లీ పేలుడు ఘటన కిరాతక చర్య

## తీవ్రంగా ఖండించిన కేంద్రకేబినేట్

## మృతులకు మంత్రివర్గం సంతాపం

## ఉగ్రవాదంపై పోరు కొనసాగుతుందని ప్రకటన

**న్యూఢిల్లీ :** దిల్లీ పేలుడు ఘటనను ఖండించిన కేంద్ర కేబినెట్.. ఇది కిరాతక ఉగ్ర ఘాతుకంగా పేర్కొంది. ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ ఘటనకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెడతామని ఉద్ఘాటించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. దర్యాప్తు కొనసాగుతున్న తీరు, భద్రతా చర్యలు, ఆయా సంస్థల మధ్య సమన్వయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా రెండు నిమిషాల పాటు కేంద్ర కేబినెట్ మౌనం పాటించింది. ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, తదితరులు పాల్గొన్నారు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోద ముద్ర వేసింది. దీని ద్వారా ఆరేళ్లపాటు రూ.25,060 కోట్లు కేటాయించనున్నారు. ఎగుమతుల ఎకో సిస్టమ్ బలోపేతానికే ఈ మిషన్‌ను తీసుకొచ్చారు. ఎగుమతిదారుల కోసం క్రెడిట్ గ్యారంటీ పథకం విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

# బంగ్లాలో శాంతియుత వాతావరణం రావాలి



**న్యూఢిల్లీ :** ప్రస్తుతం బంగ్లాలో అధికారంలో ఉన్న యూనస్ నేతత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం తీవ్రవాద శక్తులకు అధికారం ఇస్తూ.. భారత్‌తో ఆ దేశ సంబంధాలను ప్రమాదంలో పడేస్తోందని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో తలెత్తిన ఉద్రిక్తతల కారణంగా ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమె తిరిగి తన స్వదేశానికి వెళ్లే విషయంలో అక్కడి ప్రభుత్వానికి కొన్ని షరతులు పెట్టారు. స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలను నిర్వహించినప్పుడే తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తానని ఆమె స్పష్టం చేశారు. అలాగే బంగ్లాలో అవామీ లీగ్ పార్టీ పై నిషేధం ఎత్తివేయాలని ఆమె డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు నిర్వహించాలని అక్కడి ప్రజలు కూడా కోరుకుంటున్నారని ఆమె తాజాగా పీటీఐకి ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో చెప్పారు. మ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో బలమైన సంబంధాలు కొనసాగించామని, యూనస్ తన మూర్ఖత్వంతో వాటిని బలహీనపరుస్తున్నారన్నారని హసీనా విమర్శించారు. కష్ట సమయంలో ఆశ్రయం కల్పించినందుకు మోడీ ప్రభుత్వానికి, భారత ప్రజలకు ఈ సందర్భంగా ఆమె కతజ్ఞతలు తెలిపారు. తాను అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం విఫలమైందని, అలాంటి భయంకరమైన ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్నానని పేర్కొన్నారు. సమయంలో విద్యార్థి నాయకులు కూడా బాధ్యత తీసుకొని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. తనపై నమోదైన కేసుల విషయంలో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో విచారణకు హాజరవడానికి తాను సిద్ధంగా ఉన్నానని షేక్ హసీనా తెలిపారు. యూనస్ ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలను హసీనా ఖండించారు. అవన్నీ రాజకీయంగా తనను బలహీనపరచడానికి చేసిన కుట్రగా పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠం నుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటి నుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

# మదనపల్లిలో కిడ్నీ రాకెట్ గుట్టురట్టు

**అన్నమయ్య :** అన్నమయ్య జిల్లా మదనపల్లిలో కిడ్నీ రాకెట్ గుట్టురట్టయింది. మదనపల్లి పట్టణంలోని గ్లోబల్ ఆస్పత్రిలో కిడ్నీల మార్పిడి గోల్‌మాల్ అయింది. కిడ్నీ ఇచ్చిన మహిళ యమున మృతిచెందడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి భర్త సూరిబాబు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ ఆస్పత్రిపై తనిఖీలు చేశారు మదనపల్లి పోలీసులు. ఈ కేసులో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు కోడలు డాక్టర్ శాశ్వతి గ్లోబల్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మదనపల్లి డయాలసిస్ కేంద్రం మేనేజర్ బాలు, పుంగనూరు డయాలసిస్ కేంద్రం మేనేజర్ వెంకటేశ్ నాయక్‌లు కూడా కిడ్నీ రాకెట్ వెనుక ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ముఠా ద్వారా కిడ్నీల మార్పిడికి డాక్టర్ శాశ్వతి ఎ÷-లాన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. డయాలసిస్ సెంటర్‌కు వచ్చే ధనికులను డాక్టర్ శాశ్వతి గుర్తించి, డయాలసిస్ పేషెంట్లకు కొత్తగా కిడ్నీలు మార్పిడి చేస్తామని నమ్మబలికి ఈ దందాకు తెరదీశారు. అలాగే, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొందరు బ్రోకర్లని నియమించి, కిడ్నీలు విక్రయించే పేదలను ఆకర్షించి వారిని మదనపల్లికి తీసుకొచ్చి.. ఎలాంటి అనుమతి లేకుండా కిడ్నీల మార్పిడి చేశారనే అభియోగాలు ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన సూరిబాబు భార్య యమున అనే పేద మహిళను కిడ్నీ రాకెట్ బ్రోకర్లు పద్మ, సత్య, వెంకటేష్ కలిశారు. ఈ క్రమంలోనే కిడ్నీ ఇస్తే రూ.8 లక్షలు ఇస్తామని నమ్మబలికి యమునను మదనపల్లికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం యమునకు ఆపరేషన్ చేసి కిడ్నీని బయటకు తీశారు. కిడ్నీ ఇచ్చిన తర్వాత ఒక్కసారిగా ఆమె అస్వస్థతకు గురయ్యారు. అదే సమయంలో యమున ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించి మృతి చెందింది. ఆమె మృతిని గుట్టుచప్పుడు కాకుండా గ్లోబల్ ఆస్పత్రి నిర్వాహకులు దాచి పెట్టడానికి ప్రయత్నించారు. యమున మృతదేహాన్ని తిరుపతి మీదుగా విశాఖపట్నానికి తరలించడానికి ఏర్పాట్లు చేశారు. అయితే, యమున భర్త సూరిబాబుకు అనుమానం రావడంతో ఈ విషయంపై తిరుపతి పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. తిరుపతి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మదనపల్లి టూ టౌన్ పోలీసులు, గ్లోబల్ ఆస్పత్రిపై తనిఖీ చేసి అక్కడే ఉన్న మదనపల్లి డయాలసిస్ కేంద్రం మేనేజర్ బాలు, పుంగనూరు డయాలసిస్ కేంద్రం మేనేజర్ వెంకటేశ్ నాయక్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు వైజాగ్‌కు చెందిన ముగ్గురు బ్రోకర్లు సత్య పద్మా వెంకటేశ్వర్లని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ విషయంపై పోలీసుల సమగ్ర దర్యాప్తు చేస్తే మదనపల్లిలో జరుగుతున్న కిడ్నీ రాకెట్ అసలు గుట్టు బయటపడే అవకాశాలు ఉన్నాయి. ఏపీలో కిడ్నీ రాకెట్ వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది.

# ప్రజలను గూడ్స్ వాహనాల్లో రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఎస్సై విజయ్ కుమార్.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినిత్ (ఐపీఎస్) అదేశాల మేరకు



**మద్దూరు మున్సిపల్(మం)నవంబర్,12(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూరులో తమ సిబ్బంది తోకలిసి ప్రయాణికులను చేరవేసే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేసి ఐదు వాహనాలను పట్టుకొని డ్రైవర్లు,ప్రయాణికులకు కౌన్సిలింగ్ ఇచ్చిన మద్దురు ఎస్సై విజయ్ కుమార్ మళ్ళీ రిపీట్ అయితే వాహనాలను సీజ్ చేసి కోర్టులో సబ్మిట్ చేయాల్సి ఉంటుందని ఎస్సై హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రవాణా చట్ట ప్రకారం గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలి వాటిలో వ్యక్తులను, కూలీలను, చిన్నపిల్లలను రవాణా చేయడం నేరమని తెలిపారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణించడం వల్ల తీవ్ర ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ ఉంటాయని తెలిపారు. వాహనదారులు, డ్రైవర్లు గూడ్స్ వాహనాల్లో వ్యక్తులను తీసుకెళ్లినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వాహనం పై చర్యలు తీసుకొని వానాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ప్రాణాలను ముప్పుగా మారే ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుసరించరాదని కోరారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు గౌరవించి సురక్షిత రవాణా కోసం బస్సులు, ఆటోలు, టాక్సీల వంటివి వాడాలి అని మీ ప్రాణాలు మీ చేతిలో ఉన్నాయి అని గుర్తుంచుకొని ప్రయాణం చేయాలని ఎస్సై తెలిపారు.

# నోటరైజ్డ్ అఫిడవిట్ అవసరం లేదు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ నవంబర్12( సమ యం న్యూస్).:** విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాల కోసం అవస రమైన మీసేవ ధ్రువపత్రాలు (నివా సం, ఆదాయం, EWS, EBC, OBC, కుటుంబ సభ్యుల ధ్రువ పత్రం, జననం/మరణం లేట్ రిజిస్ట్రేషన్ మొదలైనవి) పొందడానికి ఇకపై నోటరైజ్డ్ అఫిడవిట్ అవసరం లేదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నోటరైజ్డ్ అఫిడవిట్ అడగడం వలన పేద ప్రజలకు అదనపు ధన వ్యయం, సమయ నష్టం జరుగుతున్నదని జిల్లా యంత్రాంగం దృష్టికి రావడంతో, ఇకపై అలాంటి అఫిడవిట్‌లు లేదా గజిటెడ్ ఆఫీసర్ ధృవీకరణ సమర్పించాల్సిన అవసరం లేకుండా మినహాయింపు ఇచ్చినట్లు చెప్పారు. ఇవి లేని పక్షంలో సెల్ఫ్ అఫిడవిట్ జతపరిచినచో తహసీల్దార్‌లు సర్టిఫికేట్‌లను త్వరితగతిన ధృవీకరించి జారీ చేయాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. అయితే, ఈ సడలింపును దుర్వినియోగం చేసి తప్పుడు పత్రాలు సమర్పించే వారిపై సంబంధిత సర్టిఫికేట్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై వివరాల కోసం –డిస్ట్రిక్ట్ మేనేజర్ బి. రవి (ఫోన్: 9989201470)ని సంప్రదించాలని సూచించారు.అయితే ఈ మినహాయింపు కుల ధ్రువీకరణ పత్రాలకు వర్తించదని, ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# సింగరేణి ఆధ్వర్యంలో యువత అభయ హస్తం ప్రోత్సాహకం

- సింగరేణి సి ఎం సి బలరాం నాయక్

**హైదరాబాద్ నవంబర్ 12( సమయం న్యూస్). :** తెలంగాణ యువత కలలను సాకారం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ప్రోత్సాహకం అందుకున్న 43 మంది అభ్యర్థులు సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా యువతకు ఆర్థిక అవరోధాలు లేకుండా, వారి కలలను సాకారం చేసేందుకు ప్రారంభించిన ఈ పథకం రెండో ఏడాది కూడా మంచి ఫలితాలను ఇచ్చింది.పట్టుదల, అంకితభావం కలిగిన యువతకు తాము నిర్దేశించుకున్న లక్ష్యంలో ఆర్థిక అవరోధాలను దూరం చేసి 43 మంది తెలంగాణ బిడ్డలు సివిల్స్ లక్ష్యానికి ఒక్క అడుగు దూరంలో నిలిచేలా చేయడం చాలా గొప్ప విషయం.తెలంగాణ యువత అంకితభావానికి, పట్టుదలకు ఇది గొప్ప నిదర్శనం. గత ఏడాది ప్రిలిమ్స్ లో అర్హత సాధించిన 140 మందికి రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించగా.. 20 మంది మెయిన్స్కు ఎంపికయ్యారు.ఈ ఏడాది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులైన 202 మందికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించగా.. వారిలో 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణం.సివిల్స్ ఇంటర్వ్యూలో కూడా మీరు విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలి. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన ప్రతి అభ్యర్థికి అతి త్వరలోనే నా చేతుల మీదుగా మరో లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించడం జరుగుతుంది. అలాగే రాష్ట్రంలోని సీనియర్ సివిల్ సర్వీసెస్ అధికారుల నేతృత్వంలో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని తెలియజేస్తున్నాం. ఇంటర్వ్యూలకు వెళ్లే అభ్యర్థులకు ఢిల్లీలో వసతి సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుంది. అందరూ సివిల్స్ లక్ష్యంపైనే దృష్టి సారించాలని మరో మారు కోరుతూ... విజయీభవ

# దేశ సమాఖ్యత ర్యాలీ

**సంగారెడ్డి నవంబర్12( సమయం న్యూస్).:** దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డిలో ఐక్యత మార్చ్ ఘనంగా జరిగింది. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని "మై భారత్" సంస్థ సమన్వయంతో ఐబి నుండి కలెక్టరేట్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాలప్రతినిధులుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

'వందేమాతరం 'జైహింద్' నినాదాలతో నగరం మార్మోగింది...తరువాత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమాన్ని ఎంపీ రఘునందన్ రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వందేమాతరం గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ... ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ తో పాటు దేశానికి స్వాతంత్రం సిద్ధించిన 100వ సంవత్సరం 2047 వరకు భారత దేశాన్ని విశ్వ గురువుగా నిలపాలని లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు . సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక. ఆయన చూపిన మార్గంలో యువత నడవాలి అన్నారు. స్వాతంత్రం వచ్చిన సమయంలో భారతదేశ 536 సంస్థానాలతో చిన్న చిన్న ముక్కలుగా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం ఉండి ప్రత్యేక రాజ్యాలుగా ఉండేదని ఆ సంస్థానాలన్నిటిని భారతదేశంలో విలీనం చేసిన మహనీయుడు అఖండ భారత నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు .అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనమైనప్పటికీ మన హైదరాబాద్ సంస్థానం తోపాటు కాశ్మీర్ భారతదేశంలో విలీనం కాలేదని అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం కోసం ఆపరేషన్ పోలో నిర్వహించి 1948 సెప్టెంబర్ 17వ తేదీన భారతదేశంలో హైదరాబాద్ సంస్థనాన్ని విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందన్నారు. సంస్థానాల విలీనం ద్వారా అఖండ భారతావని నిర్మించిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందని అన్నారు. భారతదేశాన్ని ఐక్యంగా, శక్తివంతంగా నిలబెట్టడం మనందరి బాధ్యత అని అన్నారు. దేశ సమైక్యత వెనుక పటేల్ లాంటి మహనీయుల త్యాగాలు ఉన్నాయని, ఆయన స్ఫూర్తిని ఆచరణలో పెట్టి యువత దేశ సేవలో ముందుండాలని ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ సర్దార్ పటేల్ దేశ ఏకతకు, సామాజిక సమగ్రతకు చేసిన కృషి అపూర్వం. ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, జాతీయ సమగ్రతకు ప్రతీకగా నిలిచిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకుంటూ, ప్రభుత్వ అధికారులు ఆయన స్ఫూర్తిని తమ కర్తవ్యాల్లో ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. 1947లో దేశాన్ని ఏకం చేసిన సర్దార్ పటేల్ స్ఫూర్తిని ప్రతి భారత పౌరుడు గుండెల్లో దాచుకోవాలని సూచించారు. ఆయన చూపిన మార్గం నేటి తరానికి మార్గదర్శకమని, అధికారులు ప్రజల్లో దేశభక్తి, ఐక్యతా భావాన్ని నింపేందుకు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.యువతలో దేశభక్తిని పెంపొందించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఏక్ బారత్ ఆత్మనిర్భార్ భారత్ పేరట ఈ యూనిటీ మార్చి కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. దేశ సమగ్రత కోసం భావితరాల కు స్వతంత్ర సంగ్రామంలో మహనీయులు చేసిన కృషిని తెలియజెప్పడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దూకదం చేస్తాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వం" భారతదేశ బలమని, మన అందరం ఈ దేశానికి వరమని గుర్తిస్తూ సమైక్యతతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎం.రంజిత్ రెడ్డి, జిల్లా యువజన అధికారి, భారత్, , గోల్. జిల్లా యువజన అధికారి ఖాసీం బేగ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలోట్రైనీ కలెక్టర్లు దీపికా, ప్రతిభ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు , వివిధ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికి వినియోగించాలి

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



**ఆదిలాబాద్ నవంబర్12( సమయం న్యూస్) :** స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం ద్వారానే గ్రామీణాభివృద్ధి వేగవంతమవుతుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యుడు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం అత్యవసరమని తెలిపారు. నిధుల వినియోగం పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని, పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర నిధుల ద్వారా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం ఫలాలు సామాన్య ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికి వినియోగించబడాలని పేర్కొన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య పరిశ్రమ, అటవీ, చిన్నతరహా పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, మహిళా, శిశు సంక్షేమం వంటి రంగాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాదులని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో, సమగ్ర ప్రణాళికతో పనిచేస్తే స్థిరమైన గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు.అనంతరం ఉమ్మడి జిల్లా పరిధిలోని పంచాయతీల ఆదాయం, వ్యయాల స్థితి, పన్నుల వసూళ్లు, నిధుల వినియోగం, పేదరిక నిర్మూలన, గ్రామీణ గృహనిర్మాణం, విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు అందజేశారు. అనంతరం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యుడు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవిలను అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు సోమ రాజేశ్వర్, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, ఆర్డీఓ స్రవంతి, పంచాయతీ రాజ్, శాఖ అధికారులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాఫీటేబుల్ బుక్ ను ఆవిష్కరించిన సి.ఎస్. రామకృష్ణారావు

**హైదరాబాద్, నవంబర్ 12 ::** సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ రచించిన JEWELS OF ASAF JAHIS - the Glory of WARANGAL అనే కాఫీ టేబుల్ బుక్ ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు నేడు ఆవిష్కరించారు. డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక కూడా హాజరయ్యారు. వరంగల్ నగరంలో అస్ఫజాహీల హయాంలో నిర్మితమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రం గా పాలనను చేసిన సుబేదారుల వివరాలు వారి చరిత్రతో కూడిన ఈ కాఫి టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడుతుందని సి.ఎస్ అన్నారు. పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే చారిత్రక అంశాలతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ ను క కన్నెగంటి వెంకట రమణ వెలువరించడం అభినందనీయమని సి.ఎస్ ప్రశంసించారు. వరంగల్ అంటే... కాకతీయుల పాలన, వేయిస్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం వెంటనే మదికి వస్తాయి. అయితే, వరంగల్ నగరంలో అడుగు పెట్టగానే





కాజీపేట నుండి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజీపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగునీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఎన్నో ఉన్నాయి. వీటితోపాటు వరంగల్ కేంద్రంగా వరంగల్ సుబాహ్ గా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలోని కొన్నిప్రాంతాలు ఉండేవి. ఈ వరంగల్ సుబేదారులుగా ఎవరెవరు ఉన్నారు. వారి ప్రత్యేకతలేమిటి, ఈ విషయమై కొన్ని అరుదైన, విశేషాలతోకూడిన సమాచారంతో పాటు నిజాం నిర్మిత హెరిటేజ్ కట్టడాల ఫోటోలతో కలిపి ఈ JEWELS OF ASAF JAHI S - the Glory of WARANGAL కాఫి టేబుల్ బుక్ ఉంటుంది. ఈ పుస్తకం చరిత్ర అధ్యయన వేత్తలు, విద్యార్థులు, చరిత్రపై ఆసక్తి ఉన్న వారికి ఉపయోగపడుతుంది

# దివ్యాంగులు, వృద్ధుల సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక ప్రజావాణి

- దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**మహబూబ్ నగర్ నవంబర్12( సమయం న్యూస్):** వృద్ధులు ,దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో గతంలో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం అర్బన్ తహిసిల్దార్ కార్యాలయంలో ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన రెండవ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తో కలిసి ఆమె వృద్ధులు,దివ్యాంగుల సమస్యలను శ్రద్ధగా విని, ఫిర్యాదులను స్వీకరించి, మొదటి ప్రాధాన్యతగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.ఈ సందర్భంగా 20 మంది దివ్యాంగులు, 7 గురు వృద్ధులు తమ సమస్యల వినతీ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వారం రోజులు నిర్వహించే కార్యక్రమాల పోస్టర్ ను ఆమె ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాగభూషణం, రాజసింహుడు, శివ్వన్న పంతులు, అంజయ్యాచారి,పాండురంగం, నాగేంద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే పెద్ద డాక్టర్లు.

# ఇలా వస్తారు అలా వెళ్ళిపోతారు.

- విధులు నిర్వహించేది మాత్రం
- మెడికో విద్యార్థులు,ఎస్సార్లే..







**నిజామాబాద్ సమయం ప్రతినిధి నవంబర్ 12:–** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్మాణం చేపట్టారు. ప్రతిరోజు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వేల సంఖ్యలో రోగులు చికిత్స నిమిత్తం తెలంగాణ మహారాష్ట్ర తో పాటు కర్ణాటకలోని జిల్లాకు ఆనుకుని ఉన్న ఆసుపత్రికి ఎంతో నమ్మకంతో మెరుగైన వైద్యం కోసం వస్తున్నారు. ముఖ్యంగా అన్ని రకాల సంబంధించిన పెద్ద పెద్ద డాక్టర్లు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉంటారని ఎంతో నమ్మకంతో వస్తే మాత్రం ఇక్కడ పేరుకే పెద్ద డాక్టర్లు ఇలా వస్తున్నారు అలా వెళ్ళిపోతున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ వంటి పెద్ద పెద్ద హోదాలో పెద్ద డాక్టర్లు అని చెప్పుకుంటూ బోర్డు ప్రతి విభాగంలో తమ వంతు కేటాయించుకున్నారు. ఏ ఒక్కరోజు కూడా వారికి కేటాయించిన పెద్ద డాక్టర్ల తమ తమ విభాగమైన ఆ కుర్చీ కూర్చుండేందుకు తీరిక లేకుండా పోతుంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేస్తుంటే నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు మాత్రం పెద్ద డాక్టర్ల పనితీరు ఇష్ట రాజ్యాంగా మారింది. మేమే పెద్ద డాక్టర్లము మాకు ఎవరు అడుగుతారని.... ప్రశ్నిస్తారు... మేము చెప్పిందే వేదం... మేము పెన్ను పెట్టకుంటే వైద్యమే జరగదు.... రోగి బంధువులు చికిత్స చేయాలని ప్రశ్నించిన.... ఎదురించిన తిక్కతిక్క మాట్లాడితే అందరు డాక్టర్లు ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు విధులు బహిష్కరించి. పోలీసులకు కంప్లైంట్ చేసి నిరసన కార్యక్రమం చేపడతామని భయాందోళన గురి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.. అంతేకాకుండా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో వైద్యులకు తిరగబడితే నిజామాబాద్ జిల్లా నే కాకుండా హైదరాబాద్లోని ఏ ఆసుపత్రిలో కూడా మీకు వైద్యం జరగకుండా చూసే దమ్ము మాకు ఉందని రోగి బంధువులకు ఘాటుగా వైద్యులు సమాధానం చెప్పడంతో రోగులు రోజు బంధువులు ఎక్కడ మాకు వైద్యం అందకుండా ఈ వైద్యులు చేస్తామని కరుకొండ గా చెప్పడంతో ఏమి దిక్కుతోచక ఇక్కడ వైద్యులు చెప్పే విధంగానే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగులు రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి గతంలో ఉన్న సూపర్డెంట్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనీ అన్ని విభాగాలకు సంబంధించిన హెచ్వోడి... ఆర్ ఎం ఓ... తోపాటు ఫిజీషియన్, సర్జన్, పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, పలమాలజిస్ట్, సైకియాట్రిస్ట్, ఆర్థోపెడిక్ న్యూరాలజిస్ట్, రేడియాలజిస్ట్, పాతలోజిస్ట్ తో పాటు వివిధ విభాగాల సంబంధించిన వైద్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ విభాగాలకు సంబంధించిన రోగులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తే తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్యేకంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. కానీ నూతనంగా ప్రభుత్వ జనరల్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏ ఒక్క పెద్ద పెద్ద డాక్టర్లైన ప్రొఫెసర్,అసిస్టెంట్ ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్లు, తమ విభాలకు సంబంధించిన గదులకు హెచ్ ఓ డి లు అని తమ పేరుతో కూడుకున్న పలకలు బ్రహ్మాండంగా బిగిస్తున్నారు. ఏ ఒక్కరోజు కూడా ఆ గదులను తెరిచి కూర్చున్న దాఖలాలు లేవు. వారానికి ఒకసారి ఇలా రావడం రిజిస్టర్లు అన్ని సంతకాలు ఒకటే రోజు చేయడం అలా వెళ్ళిపోవడం జరుగుతుందని విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అత్యవసర సమయంలో శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆసుపత్రికి వస్తే మాత్రం రోగులకు రోగి బంధువులకు నిరాశే మిగులుతుంది.. ఇదే ఆస్పత్రిలో గతంలో ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా అన్ని రకాల శస్త్ర చికిత్సలు జరిగిన దాఖలాలు ఉంటే ప్రస్తుతం మాత్రం ఇక్కడ అలాంటి ఆపరేషన్లు జరగడంలేదని,, ఆ శస్త్ర చికితకు సంబంధించిన ఆధునిక పరికరాలు అందుబాటులో లేవని, అంతేకాకుండా ప్రత్యేక నిపుణులైన వైద్యులు నియామకం చేయలేదని, రోగి బంధువులకు సమాధానం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మీకు ఇలాంటి శస్త్ర చికిత్సలు జరుపుకోవాలని ఉంటే హైదరాబాద్లోని ఉస్మానియా హాస్పిటల్ గాంధీ హాస్పిటల్, లేదా నిమ్స్ హాస్పిటల్ కు వెళ్లాలని సలహాలు సూచనలు ఇస్తున్నారు. మీ దగ్గర డబ్బులు ఉంటే మాత్రం ఎలాంటి ఆలస్యం చేయకుండా ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం అందాలంటే అది ఒకటే మార్గమని కరఖండుగా ప్రభుత్వ ఆసుపత్రులు వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి శస్త్రత చికిత్సలు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రత్యేక నిపుణులైన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అనుబంధం ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్నత వైద్య శిక్షణ పొందుతున్న ఎస్సార్లు, మెడికో వైద్య విద్యార్థులు మాత్రం వారికి తోచినంత వైద్య పరిజ్ఞానంతో వైద్య చికిత్సలు అందజేస్తున్నారు. అందులో కొందరైతే ఎస్ ఆర్ లు, జూనియర్ డాక్టర్లు రోగులకు సరైన రీతిలో స్పందితకపోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం రోగులతో పాటు రోగి బంధువులపై పై ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. పెద్ద డాక్టర్లే ఆ తిరుగు ఉంటే నేను చేసేది ఏమైనా ఉందా అని ఈరోజు ఇక్కడ ఉంటాం మా ట్రైనింగ్ కాలం ముగిసిన తర్వాత ఎక్కడికో వెళ్ళిపోతాం నీతోటి మాకు సంబంధం ఏంది అని ఎస్ ఆర్ లాంటి వైద్యులు ఘాటుగా సమాధానం ఇస్తూ రోగుల తోపాటు రోగి బంధువులపై ఒక డాక్టర్ వృత్తిలో ఉండి రౌడీలాగా వ్యవహరించడం జరుగుతుంది. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి.....మేము ఇంతే.... మేము ఇలాగే ఉంటాం... అంత మా ఇష్టమే. ట్రీట్మెంట్ చేసుకుంటే చేసుకోండి లేకుంటే వెళ్లిపోండి అని ఎస్సార్ వైద్యులతో పాటు జూనియర్ డాక్టర్ల మాట తీరు రోగితో తో పాటు రోగి బంధువులకు చాలా ఇబ్బందికరంగా మారుతుంది. ఎవరైనా ఆవేదనతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపర్డెంట్ గాని సంబంధిత అధికారులకు గాని ఫిర్యాదు చేయడానికి పోతే పట్టించుకునే నాధుడే లేడు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పెద్ద వైద్యులతో పాటు చిన్న చిన్న వైద్యులు కూడా ఇష్టం వచ్చినట్లు రోగులతో గొడవలకు దిగుతుంటే ఇక రోగులకు మెరుగైన వైద్య సేవలు ఎక్కడ అందుతాయని రోగులు నిరాశ చెందుతున్నారు. ఇంత పెద్ద ఆస్పత్రి అయిన ఏ ఒక్కరోజు కూడా జిల్లా మంత్రి గానీ, జిల్లా ఎంపీ, అర్బన్ ఎమ్మెల్యే తో పాటు జిల్లా కలెక్టర్ కూడా ఆకస్మిక తనిఖీలు చేయకపోతే పెద్దపెద్ద డాక్టర్ల ఇష్టం వచ్చినట్లుగా డ్యూటీలు చేస్తూ 30 రోజులు పూర్తి కాగానే విధులకు హాజరు కాకపోయినా చివరి చివరి రోజు విధులకు హాజరై రిజిస్టర్లలో నెలరోజుల సంతకాలు ఒకేరోజు చేసి లక్షల రూపాయలు వేతనాన్ని దర్జాగా అందుకుంటున్నట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది తోపాటు కిందిస్థాయి సిబ్బంది చర్చించుకుంటున్నారు. మరికొందరైతే పెద్దపెద్ద డాక్టర్ల పని తీరుపై సామెతలుగా పేరుకే పెద్ద డాక్టర్..... ఏ ఒక్క రోజు కూడా పని చేయడు...... పుణ్యానికి జీతం అయితే తీసుకుపోతాడు అని బహిరంగానే ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రతి ఒక్కరు సంభాషించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధం కలిగి ఉన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గాని, జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి తోపాటు ఎంపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యుల పనితీరుపై దృష్టి సారించి రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అదే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# విద్య ద్వారానే పేదరికం నుండి ముక్తి

- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



**ఖమ్మం , నవంబర్12 : ( సమయం న్యూస్ ) :** విద్య ద్వారానే పేదరికం నుండి శాశ్వతముక్తి లభిస్తుం దని వరంగల్‌బి ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీపింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు.తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల కళాశాల (బాలికలు –2 ) లోప్రిన్సిపల్ సీతామహాలక్ష్మి అధ్యకతన దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భముగా మైనారిటీ డే బినేషనల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించుట జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న వరంగల్–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీపింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ గురుకులాలు విద్యార్థుల పాలిట వరం అన్నారు. స్వతంత్రం వచ్చిన తర్వాత మొట్టమొదటి నెహ్రూ నాయకత్వంలో క్యాబినెట్ లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం మైనార్టీ విద్యపై దృష్టి పెడుతూ గురుకులాలను ఏర్పాటు చేసిందని ప్రత్యేకంగా మైనార్టీ బాలికల విద్యపై దృష్టి సారించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సీతామహాలక్ష్మి పాఠశాల నివేదికను సమర్పిస్తూ పాఠశాల స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారని విద్యార్థులు చదువుతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం జమాఅతెఇస్లామీ హింద్ జిల్లా మీడియా సెక్రటరీ అబ్దుల్ మలిక్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దృష్టిలో దేశ స్వాతంత్ర్యం అంటే, కేవలం పరాయి పాలన నుండి విముక్తి పొందడం కాదు. అది హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు – అందరూ కలిసిమెలిసి, ఒకే భారతీయులుగా జీవించగల ఒక సమైక్య భారతాన్ని నిర్మించడం. అమ్మాయిలు తాను తలుచుకుంటే ఏదైనా సాధిస్తారు దానికి నిదర్శనం మహిళ ప్రపంచ వరల్డ్ కప్ సాధించడమే మీరు కూడా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు ఈ కార్యక్రమం లో ఆర్. రంగారావుగారు పి ఆర్ టి యు స్టేట్‌జనరల్ సెక్రటరీ, యలమద్ది వెంకటేశ్వరరావు హెల్పింగ్ హ్యాండ్ కన్వీనర్, సోమిరెడ్డి శ్రీనివాసరావు పి ఆర్ టి యు ఆడిట్ కమిటీ, చింతూలూరి ప్రసాద్ ఏ ఐ ఎఫ్ టి యు మెంబర్,ఖమ్మం, రీజినల్ లెవెల్‌కో ఆర్డినేటర్ ఎం. జె. అరుణ కుమారి, విజిలెన్స్ ఆఫీసర్స్ కె. సీతారాములు, రవూఫ్ ఈ సందర్భంగా విద్యలో రాణించినవిద్యార్థులకు మెమొంటోస్ అందజేశారు విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాల తో అలరించారుఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ,తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఆలయ పరిసర ప్రాంతాల్లో వైన్ షాపులు పెట్టవద్దు మహిళల తిరుగుబాటు




**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 12 :** ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎడ్యుకేషనల్ హబ్, సంతోషి మాత ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం సరి కాదని కాలనీ వాసులు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సంగపూర్ రోడ్ ఎడ్యుకేషనల్ హబ్ కీ పోయే స్థలం లో, సంతోషి మాత ఆలయ పరిసర ప్రాంతం లో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న కాలనీ వాసులు, సంతోషి మాత ఆలయ పరిషత్ వారు ఈ పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దు అని ఎక్సైజ్ అధికారులకి, మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందచేశారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్యం దుకాణాల ఏర్పాటుకు మేము అడ్డు రాము అని, నిత్యం మహిళలు, పాఠశాల విద్యార్థులు తిరిగే స్థలం లో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదు అని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కి నిత్యం వేలాది మంది వస్తుంటారు అని మద్యం దుకాణంకి ఈ స్థలం అనువైనది కాదు అని, మద్యం దుకాణాలలో అసాంఘిక కార్యక్రమాలు జరిగే ఆస్కారం ఉన్నందున దుకాణం యాజమానులు నిర్ణయం మార్చు కొని వేరే స్థలం లో మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవాలని లేనిచో మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# కౌలు రైతులు వెంటనే పంట నమోదు పూర్తి చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ నవంబర్12( సమయం న్యూస్).:** జిల్లాలోని కౌలు రైతులు, అలాగే డిజిటల్ సంతకం లేని భూములు, పీపి () భూములు, పార్ట్–3 భూములు కలిగిన రైతులు కనీస మద్దత్తు ధరకు తమ పంటను విక్రయించే అవకాశాన్ని కోల్పోకుండా తక్షణమే పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. కౌలు పై ప్రత్తి పంట పండించిన రైతులు, తమ పంటను సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి నమోదు చేసుకోవాలంటే, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద తమ కౌలు వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ ప్రక్రియలో రైతులు కౌలు చీటీ, తమ స్వీయ వివరాలు, పట్టాదారు వివరాలు సమర్పించాలన్నారు. నమోదు సమయంలో పట్టాదారు మొబైల్ నంబర్‌కు వస్తుందని, ఆని వ్యవసాయ విస్తరణ అధికారికి తెలియజేయాలని సూచించారు. అనంతరం కౌలు ఒప్పంద పత్రం సమర్పించిన తర్వాత కౌలు పంట నమోదు పూర్తి అవుతుందని వివరించారు. నమోదైన రైతుల వివరాలు 'కపాస్ కిసాన్' యాప్‌తో అనుసంధానం అవుతాయని, ఆ యాప్ ద్వారా రైతులు స్లాట్ బుకింగ్ చేసుకుని సీసీఐ కొనుగోలు కేంద్రాలలో ప్రత్తి పంటను కనీస మద్దత్తు ధరకు అమ్ముకోవచ్చని కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా, డిజిటల్ సంతకం లేని భూములు, భూములు, పార్ట్%–%3 భూములు కలిగిన రైతులు కూడా తమ మొక్కజొన్న, సోయాబీన్, ప్రత్తి పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మాలంటే, తమ పంట వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తప్పనిసరిగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్ముకోవాలి. దీనివల్ల వారికి సరైన మద్దత్తు ధరతో పాటు ప్రభుత్వ రక్షణ కూడా లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన డిఆర్ఓ వెంకటేశ్వర్లు ఆర్డిఓ మహేశ్వర్



**కరీం నగర్ నవంబర్12( సమయం న్యూస్).:** జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం డిఆర్ఓ బి .వెంకటేశ్వ ర్లు ఆర్డిఓ కే .మహేశ్వర్ తో రాజ కీయ పార్టీ ప్రతినిధిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదా వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె.మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మదుపు మోహన్, బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , బిజెపి పార్టీ ప్రతినిధి నాపల్లి శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ ప్రతినిది బర్కత్ ఆలీ, టిడిపి పార్టీ ప్రతినిది కళ్యాడపు ఆగయ్య ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సఖీ, శిశు గృహ తనిఖీ చేసిన.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య.



**సంగారెడ్డి నవంబర్12( సమయం న్యూస్) :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవానిచంద్ర గారి ఆదేశాల ప్రకారం ఈ రోజు శిశు గృహ ,సఖి నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు గారు తనికి నిర్వహించటం జరిగినది.ఈ తనికి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు మాట్లాడుతూ పిల్లలకు అన్ని చట్టలపైనా అవగాహనా ఉండాలి అన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తేలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు.మంచి చదువులు చదివి ఉన్నత ఎదుగుదల ఎదగాలని అన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు.

## హిమగిరి మిత్రబృందం ఆధ్వర్యంలో చిన్నారులకు చేయూత



**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 12 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు చెందిన హిమగిరి మిత్ర బృందం ఆధ్వర్యంలో బుదవారం ఉపాధ్యాయ దంపతులు మల్లికార్జున్ సౌజన్య దంపతుల సహకారంతో ఇద్దరు అమ్మాయిలకు 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన వారికి చేయుతని అందజేశారు ఈ సందర్భంగా టీచర్ మల్లికార్జున్ మాట్లాడుతూ హిమగిరి మిత్ర బృందం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా గజ్వేల్ మండలం నెంటూరు కొడకండ్ల గ్రామాలకు చెందిన తల్లి తండ్రి కోల్పోయిన ఇద్దరు నిరుపేద అమ్మాయిలకు ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల చొప్పున 10 వేల రూపాయలు అందజేయడం జరిగిందని హిమగిరి మిత్ర బృందం ఆధ్వర్యంలో రాబోయే కాలంలో సేవలను మరింత విస్తృతం చేస్తామని, ప్రతి ఒక్కరూ సేవ నిరతి కలిగి ఉండాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు, కనకయ్య హిమగిరి మిత్ర బృందం బారు అరవింద్, మద్ది నరేందర్, దేవులపల్లి జగదీష్, కర్కల విష్ణు వర్ధన్ రెడ్డి, తత్తరి గిరిబాబు రమణాకర్ తదితరులు పాల్గొన్నారు

## జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

- రోడ్డు ప్రమాదాలు మరియు సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్ పరిధిలోని
- ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.



**జూలూరు పాడు నవంబర్12( సమయం న్యూస్).:** ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ గారు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీ లక్ష్మీ,ఎస్సై రవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం అమ్మిన రైతుకు ఇబ్బందులు లేకుండా సకాలంలో డబ్బులు అందేలా చర్యలు కలెక్టర్

- ధాన్యం దిగుమతి చేయడంలో మిల్లర్లు వేగం పెంచాలి.
- తాసిల్దార్లు తరచూ రైస్ మిల్లును తనిఖీ చేయాలి.



**కోల్వారం నవంబర్12( సమయం న్యూస్) :** కొల్చారం మండలంలో సత్య సాయి రైస్ మిల్, వరిగుంతం ఫ్యాక్స్ కొనుగోలు కేంద్ర పరిశీలనలో కలెక్టర్ వెల్లడిజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్వడ్లు అమ్మిన రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో డబ్బులు జమ అయ్యేవిధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.కొల్చారం మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ముందుగా సత్యసాయి రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని ఎప్పుడు దిగుమతి చేసుకున్నారు వంటి అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ తనిఖీలో ధాన్యం సేకరణ, నిల్వ ప్రక్రియలపై ఆయన ఆరా తీశారు.

రైస్ మిల్లులో ధాన్యం దించుకుంటున్న విధానాన్ని పరిశీలించారు.ఏ లారీ కూడా 24గంటలకు మించి వెయిటింగ్ లో ఉండకూడదని అందుకు తగ్గట్టు గా రైస్ మిల్లర్లు హమాలీలని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం వరిగుంతం ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు నిర్వహణ తీరు సంబంధిత వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 82 వేల 481 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని21 ,277మంది రైతులకు గాను 54 కోట్ల 52 లక్షల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. రైతులు అహర్నిశలు కాయ కష్టం చేసి పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు ధర పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించడం జరుగుతుందని మిల్లర్లు సహకరించి త్వరితగతిన ధాన్యాన్ని దిగుమతి చేసుకొని వెంటనే లారీలను పంపించాలని సూచించారు.వడ్లు అమ్మిన రైతుకు ఇబ్బందులు లేకుండా సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చాక నిబంధనల ప్రకారం.. తేమ, తాలు చూసుకొని వెంటనే తూకం చేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని వివరాలు సేకరించి వాటి ఆధారంగా రైతుకు సంబంధించిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో అప్లోడ్ చేసి త్వరగా డబ్బులు అకౌంట్ లో పడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు నాణ్యమైన ధాన్యం విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు.ఎంపీడీవో , డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి స్పెషల్ డ్రైవ్

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సుదీర్ఘ సమీక్ష



**నిజామాబాద్, నవంబర్ 12 ( సమయం న్యూస్).** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనకు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై కలెక్టర్ ఎంపీడీఓలు, హౌసింగ్ ఏ.ఈలు, ఎంపీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటివరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు పురోగతి సాధించడం లేదని నిలదీశారు. వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని సూచించారు. మంజూరీలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలన్నారు. లాగిన్ విషయంలో, ఇతరాత్ర ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు ఉన్నా, వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపులలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు లబ్ధిదారుల వివరాలు ఆధార్ కార్డు వివరాలతో సరిపోలి ఉన్నాయా అన్నది పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు అవసరం ఉంటే ఆధార్ అప్డేషన్ చేయించాలని అన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. తాను ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తానని, ఎప్పటికప్పుడు స్పష్టమైన పురోగతి కనిపించాలని అన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఈ.ఈ నివర్తి, డీ.ఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.
- వారి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కలెక్టర్



**బొంరస్ పేట మండలం,నవంబర్,12(సమయం న్యూస్) :** కొడంగల్ నియోజకవర్గం,బొంరస్ పేట మండలం లోని కొత్తూరు, నాగిరెడ్డిపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందిస్తూ ఏ – గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు 2389 రూపాయలు, సాధారణ రకానికి 2369 రూపాయల చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు సన్న రకానికి అదనంగా 500 రూపాయల చొప్పున బోనస్ అందించనుందన్నారు.కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. తాగునీరు, నీడ వసతి నిమిత్తం టెంట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకుని ధాన్యం తూకం జరిగేలా, ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు రవాణా జరిగేలా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పరిష్కరించాలని అన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లి లోని నూతనంగా నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించి, ఇండ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు చేసుకున్న కుటుంబాలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ , గ్రంధాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి,అడిషనల్ డీఆర్డీఓ నరసింహులు,డీసిఎస్ఓ సుదర్శన్,డీఎంసిఎస్ మోహన్ కృష్ణ,సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) శంకర్ రాథోడ్, తాహసిల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్న గౌడ్, లతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సభ్యుల సొమ్మును సక్రమంగా వినియోగించాలి

- డి ఆర్ డి ఓ విద్యా చందన



**భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్ 12:( సమయం న్యూస్ ) :** సభ్యుల సొమ్మును సక్రమంగా వినియోగించాలి అని, సంఘం తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డిఆర్డివో విద్యా చందన అన్నారు.జిల్లాలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సీఆర్ పీ స్ట్రాటజీ కార్యక్రమం కింద జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామ సంఘాలు , మండల సమాఖ్యలు పనితీరును సమీక్షించేందుకు మొత్తం 10 మంది సీనియర్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ గత 15 రోజులుగా విస్తృత పర్యటన చేపట్టారు.గత నెల 28వ తేదీ నుండి ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహించిన పర్యటన అనంతరం బుధవారం ఐడి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలోసమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలోజిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి. విద్యా చందనపాల్గొని సీ అర్ పీ లు సమర్పించిన నివేదికలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు తీసుకున్న బాధ్యతలను కట్టుబాట్లతో పాటిస్తూ, తీసుకున్న రుణాలను సమయానికి తిరిగి చెల్లించాలి. పుస్తక నిర్వహణను క్రమబద్ధంగా కొనసాగిస్తూ సభ్యుల సొమ్మును సక్రమంగా వినియోగించాలి. ఎక్కడా కూడా నిధుల దుర్వినియోగం జరగకుండా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలి అని సూచించారు.సంఘ సభ్యులు శిక్షణా కార్యక్రమాల ద్వారా అవగాహన పెంపొందించుకొని స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగాలని, సీనియర్ లు తగిన మార్గదర్శకతతో గ్రామ స్థాయిలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డి ఆర్ డి ఓనీలేష్ , జిల్లా సమాఖ్య అధ్యక్షులుసుజాత , డిపిఎంసి.హెచ్. అనూరాధ , సీనియర్ సీ అర్ పీ లు, అన్ని మండలాల ఏ పి ఎమ్ లు , వి ఓ అధ్యక్షులు, సీ సీ లు , వి ఒ ఏ లు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న 30 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత

**ఖమ్మం, నవంబర్ 12 :( సమయం న్యూస్ ) :** పోగొట్టుకున్న 30 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ బి. రామానుజ తెలిపారు. పోగొట్టుకున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను బాధితులు సీ ఇ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చెయ్యాలని లేకుంటే గుర్తు తెలియని వ్యక్తులు మీ ఫోన్ ద్వారా క్రైమ్ లో పాల్గొన్నట్లయితే ఫోను యజమాని కి ఇబ్బంది కలుగుతుంది అన్నారు. సీ ఇ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన ఐటి సెల్ బృందం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం యజమానులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అప్పగించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు ఎనిమిది లక్షల విలువ గల 30 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కొక్క మొబైల్ ఫోన్ యాబై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే మొబైల్ ఫోన్లు7998 పోగొట్టుకున్నట్లు సీ ఇ ఐ ఆర్ పోర్టల్ ఫిర్యాదులు నమోదు కాగా 2938 ఫోన్ల ట్రాక్ ను గుర్తించి మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు.




ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న...నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న /చోరికి గురైతే పరిస్తితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు. సెల్ ఫోన్ల రికవరీ లో కీలకంగా వ్యవహరించిన ఐటి సెల్ ఇన్చార్జి హేమనాథ్ , టెక్నికల్ బృందాన్ని ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ అభినందించారు.

# నిర్ణీత గడువులోపు అభివృద్ధి నిర్మాణ పనులను పూర్తి చేయాలి

**- ఉమ్మడి మద్దూరు మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.**

**మద్దూరు మున్సిపల్(మం)నవంబర్,12 (సమయం న్యూస్)**

నారాయణ పేట జిల్లాలోని మద్దూరు మండలంలో కడ నిధులు, ఇతర నిధులు) తో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి ఉమ్మడి మద్దూరు మండలంలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముందుగా మద్దూరు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో రూ. కోటి 10లక్షల నిధులతో దాదాపు పూర్తి కావచ్చిన పీ ఏ సీ ఎస్ ( సింగిల్ విండో) కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. చివరి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రూ.55 లక్షలతో నిర్మిస్తున్న మద్దూరు సీ హెచ్ సీ ప్రహరీ నిర్మాణ పనులను చూశారు. ఆస్పత్రి లోకి వెళ్ళి అదనపు వార్డులో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసి ఆ వార్డును అందుబాటులోకి తీసుకురావాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. తర్వాత రూ.30 కోట్లతో కొనసాగుతున్న మద్దూరు - మోమినాపూర్ రెండు వరసల బీటీ రోడ్డు నిర్మాణ పనులను చూసీ, పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నాయని అధికారులు,గుత్తేదారుని ప్రశ్నించారు. రోడ్డుకు ఒకవైపు ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు జరగక పోవడంతో పనులు ఆగి సాగుతున్నాయని, అలాగే మిషన్ భగీరథ పైప్ లైన్లు ఉన్న చోట కొంత సమస్యగా మారుతోందని గుత్తేదారుడు కలెక్టర్ కు తెలపడంతో స్పందించిన కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. అదే మార్గంలో రూ. కోటి 60 లక్షలతో వ్యయంతో నిర్మాణం అవుతున్న రేని వట్ల స్కూల్ కాంప్లెక్స్ పనులను చూశారు. పనుల్లో వేగం పెంచాలనీ, వచ్చే విద్యా సంవత్సరం నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత మద్దూరు మండల కేంద్రం చింతల్ దిన్నె వెళ్ళే దారి పక్కన రూ.30 లక్షల నిధులతో చేపట్టిన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ నిర్మాణ పనులకు ఇబ్బందిగా మారిన ఓ ప్రార్థనా మందిరాన్ని తొలగించే అంశంపై స్థానిక ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు, అధికారులతో చర్చించారు. అందరూ కలిసి అక్కడే మరోచోట కొత్త మందిరాన్ని నిర్మించేలా తగిన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్, కడ ప్రత్యేక అధికారి కోరారు. వీటితో పాటు మద్దూరు పోలీస్ స్టేషన్ చుట్టూ రూ. 60 లక్షలతో నిధులతో కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. మద్దూరు మండల కేంద్రానికి సమీపంలో రూ. 6 కోట్లతో నిర్మించే ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కూడా వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈ ఈ. హిర్యా నాయక్, డీ ఈ ఈ విలోక్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ మల్లికార్జున్, తాసిల్దారు మహేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎంపీ ఓ, రెవెన్యూ అధికారులు ,సింగిల్ విండో అధ్యక్షులు నర్సింలు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వచ్చే విద్యా సంవత్సరానికి భవనాలు పూర్తి కావాలి కలెక్టర్

**కొత్తపల్లి,గుండుమాల్మండలం, నవంబర్,12(సమయం న్యూస్) :** వచ్చే విద్యా సంవత్సరం నాటికి మండలంలో కొనసాగుతున్న అన్ని కళాశాల భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించేలా పనులు వేగిరం చేయాలని కలెక్టర్ సూచించారు. భూనేడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.5.50 లక్షలతో నిర్మిస్తున్న కొత్తపల్లి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులను కడ ప్రత్యేక అధికారి తో కలిసి ఆమె పరిశించారు. పనుల్లో వేగం పెంచి జూన్ 2026 నాటికి కొత్త. కళాశాలను ప్రారంభించాలని ఆమె తెలిపారు. ఆ పాఠశాలలో సాయంత్రం కొనసాగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను కలెక్టర్ పర్యవేక్షించారు. గత ఏడాది కంటే ఈ సారి పది ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణుల శాతం రావాలని, హార్డ్ సబ్జెక్ట్ ఏదైనా ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో ప్రత్యేక క్లాస్లు చెప్పించాలని హెచ్ ఎం కు సూచించారు. డిసెంబర్ నెలాఖరునాటికి సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ ప్రారంభించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో డైనింగ్ హాల్ నిర్మాణం గురించి అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం కొత్తపల్లి -గుండు మల్ వరకు రూ. 38 కోట్లతో చేపట్టిన ఆర్ అండ్ బి బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ కొత్తపల్లి సమీపంలో కాలువ వద్ద వంతెన నిర్మాణ పనులు నిలిచి పోవడంపై అర్ అండ్ బి అధికారులను వివరణ కోరారు. వర్షాల కారణంగా పనులు నిలిచి పోయాయని అధికారులు జవాబు ఇవ్వగా, మరోసారి పరిశీలనకు వచ్చే లోపు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తర్వాత నారాయణపేట జిల్లా కొత్తపల్లి,గుండుమల్ మండల కేంద్రాలలో రూ.8.80 లక్షలతో నిర్మిస్తున్న మండల కార్యాలయాల సమీకృత భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని, గడువులోపు మండల కార్యాలయాల సమీకృత సముదాయాలు పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గుండుమల్ జెడ్పి ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. కోటి నిధులతో నిర్మాణం పూర్తికావస్తున్న అదనపు గదుల పనులను వారు పరిశీలించారు. గుండుమల్ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి వసతి గృహ ఆవరణలో ప్రారంభించిన వసతి గృహ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. వసతి గృహంలో కొనసాగు తున్న సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్ ను కలెక్టర్, కడ అధికారి పర్యవేక్షించారు. వసతి గృహ వంటగదికి వెళ్లి విద్యార్థులకు వండుతున్న రాత్రి భోజనాన్ని వారు పరిశీలించారు. మెనూ ప్రకారం కూరగాయలు లేకపోవడం, వసతి గృహంలో వార్డెన్ లేకపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్ ను గురువారం కలెక్టరేట్ కు తీసుకురావాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మళ్ళీ విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించి, వసతి గృహ సమస్యలపై ఆరా తీశారు. అందరూ బాగా చదువుకోవాలని సూచించారు. చివరగా రూ. 5.50 లక్షలతో చేపడుతున్న గుండుమాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి, వీలైనంత తొందరగా పనులు పూర్తిచేసేలా అధికారులు దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఈ ఈ,డీ ఈ, ఆర్ అండ్ బి డీ ఈ, ఏ ఈ లు, ఆయా మండలాల తాసిల్దారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ -ప్రతిక్ జైన్



**వికారాబాద్, నవంబర్,12(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా అనంతగిరి నందు శ్రీ అనంత పద్మనాభ స్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. బుధవారము జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్ లతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు పూర్ణ కుంభం తో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్ఞాపిక ను బహుకరించారు. ఈ కార్యక్రమం లో డి ఆర్ ఓ మంగీ లాల్ ,ఆర్ డి ఓ వాసు చంద్ర , డి పి ఆర్ ఓ చెన్నమ్మ,తహసిల్దార్ లక్ష్మీనారాయణ,ఆలయ ఇ ఓ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిశీలన వేగం పెంచండి.

**● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**మహాదేవపూర్ నవంబర్12( సమయ్దం న్యూస్). :** భూ భారతి, సాధాబైనామా దరఖాస్తుల పరిశీలనలో వేగం తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మహదేవపూర్ తహసీల్దార్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం మహదేవపూర్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పాల్గొన్నారు.

సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన పరిశీలన నివేదిక ఉండాలనితిరస్కరణ జరిగితే, సవివరమైన కారణాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పౌరులకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, భూ సంబంధిత ప్రజా సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ రామారావు, నాయబ్ తహశీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ధాన్యం చివరి గింజ కొనుగోలుకు చర్యలు

**● జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్**

**ఖమ్మం, నవంబర్ 12బీ ( సమయం న్యూస్ ) :** నాణ్యమైన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025 సంబంధించి 326 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, నవంబర్ 12 నాటికి 52 వేల 260 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. తల్లాడ, కల్లూరు పరిధిలో 101 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 5 వేల 134 క్వింటాళ్ల సన్న రకం ధాన్యానికి 500 రూపాయల చొప్పున బోనస్ మొత్తం 25 లక్షల 67 వేలు రైతుల బ్యాంకు ఖాతాలలో మూడు రోజులలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు పట్ల రైతులు అనవసర ఆందోళనలకు గురి కావద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధరను చెల్లిస్తుందని చందన్ కుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న జిల్లా పోలీస్ పీఆర్ఓసి.వెంకట్ రాములు



**నారాయణపేట, నవంబర్,12(సమయం న్యూస్) :** హైదరాబాద్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో మూడు రోజుల పాటు నిర్వహించిన పిఆర్ఓ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన నారాయణపేట జిల్లా పోలీస్ పి ఆర్ ఓసి. వెంకట్ రాములు ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ అభినందించి ప్రశంసా పత్రం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి ఐపీఎస్, డీసీఓ సీఏఆర్ రక్షిత మూర్తి ఐపీఎస్. శిక్షణ కో ఆర్డినేటర్ మధుసూదన్,పోలీసు సురక్ష బృందం,తదితరులు పాల్గొన్నారు.



## డిజిపి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న
# వరంగల్ పోలీస్ పిఆర్ఓ

**వరంగల్ నవంబర్12( సమయం న్యూస్):** తెలంగాణ పోలీస్ సురక్ష ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ పిఆర్ఓలకు హైదరాబాద్ సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పిఆర్ఓ శిక్షణ శిబిరంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పిఆర్ఓ మన్నవ మోహన కృష్ణ అభినందిస్తూ రాష్ట్ర తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఐజీ యం. రమేష్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రసవాల నిర్వహణలో నల్గొండ ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుంది

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**నల్లగొండ నవంబర్12( సమయం న్యూస్):** ప్రసవాల నిర్వహణలో నల్గొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుందని అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మంత్రి నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ తర్వాత ఎక్కువగా ప్రసవాలు నిర్వహించే అతిపెద్ద ఆస్పత్రిగా నల్గొండ జిజిహెచ్ పేరుపొందిందని, ప్రతినెల 700 నుండి 800 వరకు ప్రసవాలు చేయడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు ఏ ఇతర ఆస్పత్రిలో లేవని , ఆసుపత్రిలో అన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇటీవలే బేబీ వార్మ్స్, లాప్రోస్కోపిక్ మిషన్ వంటివి ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు, మూడు లక్షల రూపాయల విలువ చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేస్తున్నామని,ఇవి సద్వినియోగం చేసుకోవాలని కోరారు .ఇంకా ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని,అవసరమైతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామని చెప్పారు. ప్రసవాల కోసం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి రావాలని, ఇందుకు ఆశ, అంగన్వాడీ, ఆస్పత్రికి సిబ్బంది, అంబులెన్స్ వాహనాల డ్రైవర్లు, డాక్టర్లు కృషి చేయాలని మంత్రి అన్నారు. వైద్య సేవలలో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని రాష్ట్రం లోనే నంబర్ వన్ గా నిలపాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డిఆర్డిఓ శేఖర్రెడ్డి, ఆర్డిఓ వై అశోక్ రెడ్డి,జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్ అరుణ కుమారి, ఆర్ఎంవో , ఇతర అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శాఖల ప్రధాన కార్యాలయాలపై
# మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీ



**హైదరాబాద్ నవంబర్12( సమయం న్యూస్):** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం తన పరిధిలోని శాఖల ప్రధాన కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన HACA, సీడ్ సర్టిఫికేషన్ కార్పొరేషన్, సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్, టెక్స్టైల్స్ ప్రధాన కార్యాలయాలను సందర్శించారు. తనిఖీల సందర్భంగా సమయానికి హాజరుకాని కొంతమంది అధికారులపై మంత్రి గారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పొరుగుసేవల సిబ్బంది సమయపాలన పాటిస్తుండగా, రెగ్యులర్ ఉద్యోగులలో ముఖ్యంగా జనరల్ మేనేజర్, మేనేజర్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మంత్రి గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలనను కఠినంగా అమలు చేయాలని, విధులపట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని మంత్రి గారు హెచ్చరించారు. సమయానికి విధులకు హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల కమిషనర్లు, ఎండీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతస్థాయి అధికారులు నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రజాసేవలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# ఎగ్జిట్ పోల్స్ గుసగుస!

## గెలుపు ఎవరి వైపు?




**దేశ రాజకీయాల గతిని మలుపు తిప్పగల బిహార్ ఎన్నికల ఫలితాలు, తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలతో పాటు, అంచనాలకు భిన్నంగా వెలువడి, దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఫలితాలు కేవలం అంకెల గెలుపు మాత్రమే కాదు, కుల సమీకరణాలు, ప్రాంతీయ ఆకాంక్షలు, సంక్షేమ హామీల కలగలుపుతో కూడిన నూతన రాజకీయ సూత్రాన్ని ఆవిష్కరించాయి. అనూహ్య తీర్పు వెనుక ఉన్న సామాజిక, రాజకీయ రహస్యం ఏమిటి, విజయం రాబోయే కేంద్ర, రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపబోతోంది అనే అంశంపైనే ఇప్పుడు దేశం దృష్టి ఉంది.**

### స్థిరమైన పాలన వైపు ప్రజల తీర్పు

బిహార్, జూబ్లీహిల్స్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ తీవ్ర ఉత్కంఠ మధ్య ముగుస్తుంది. బిహార్ ఎన్నికల్లో ప్రధాన కూటమిలో మెజారిటీ మార్కును దాటి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు నిశ్చయాత్మకమైన తీర్పును సాధించింది. అదే సమయంలో, జుబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం రాష్ట్రంలో అధికారంలో ఉన్న పక్షం యొక్క పనితీరుకు, ప్రతిపక్షం యొక్క పట్టుకు అద్దం పట్టింది. విజయం సాధించిన పక్షం, ప్రజలు స్థిరమైన ప్రభుత్వాన్ని, అభివృద్ధిని కోరుకుంటున్నారనే విషయాన్ని నిరూపించింది.

### బిహార్‌లో 'మహాదళిత్' సంక్షేమ విజయం..

బిహార్ ఎన్నికల విజయం కేవలం సంప్రదాయ కుల రాజకీయాల ఆధారంగా మాత్రమే రాలేదు. విజయం సాధించిన పక్షం, 'మహాదళిత్' అత్యంత వెనుకబడిన కులాల ఓట్లను ఏకతాటిపైకి తీసుకురావడంలో విజయం సాధించి, సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన హామీలను సమర్థవంతంగా వినియోగించుకుంది. యువత, మహిళా ఓటర్ల మొగ్గు పాత రాజకీయ ధోరణులను దాటి ఆర్థిక భద్రత వైపు మళ్లిందనేది ఫలితాల ద్వారా స్పష్టమవుతోంది.

### జుబ్లీహిల్స్ పట్టు కోసం పోరాటం..

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాలకు ఒక కీలక సంకేతం. ఉపఎన్నిక ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌పై 'జుబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎవరు గెలుస్తారు.. పాలక పక్షం గెలుపు వారి ప్రజాకర్షక పథకాలకు అందిన మద్దతుగా పరిగణించబడగా, ప్రతిపక్షం పటిష్టమైన పోటీ ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా వారి పట్టు తగ్గలేదని సూచిస్తుంది.

### ఆత్మపరిశీలన అవసరం..

ఎన్నికలలో ఓటమి చవిచూసిన పక్షాలు, తమ ఓటమికి గల ఆంతరంగిక, బాహ్య కారణాలపై లోతైన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. బిహార్‌లో, ఓటమి పాలైన పక్షం మారుతున్న ప్రజాభిప్రాయాన్ని అంచనా వేయడంలో విఫలమై, బూత్ స్థాయి నిర్వహణలో బలహీనతలను ఎదుర్కొంది. జూబ్లీహిల్స్‌లో, కొన్ని వర్గాల ఓటర్లను ఆకర్షించడంలో విఫలమవడం ఓటమికి దారితీసింది. రాజకీయాల్లో అతివిశ్వాసం ఎంత ప్రమాదకరమో ఈ ఫలితాలు నిరూపించబడుతాయి.

### బిహార్ ఫలితాల ప్రభావం..

బిహార్ ఎన్నికల ఫలితాలు రాబోయే దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. బిహార్‌లో విజయం సాధించిన పక్షం, దేశంలోని సారూప్య రాజకీయ ప్రాంతాలలో తమ వ్యూహాలను బలోపేతం చేసుకుంటుంది. ఇది కేంద్రంలో విపక్ష కూటముల నిర్మాణానికి, పాలక కూటమి బలాన్ని పెంచడానికి నిర్దిష్ట దిశను అందిస్తుంది, స్థానిక అంశాలతో పాటు జాతీయ విధానాలు కూడా ప్రజల తీర్పును ప్రభావితం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని వెల్లడిస్తాయి.

### నియమాల పారదర్శక అమలు..

బిహార్, జూబ్లీహిల్స్‌లో ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించడంలో విజయం సాధించింది. ముఖ్యంగా, కేంద్ర బలగాల మోహరింపు, వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ ద్వారా ఈసీ పవిత్రతను కాపాడింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 కింద చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఈసీ చూపిన దృఢత్వం, అక్రమాలకు పాల్పడే వారికి ఒక హెచ్చరికగా నిలిచింది.

### కొత్త రాజకీయ సూత్రానికి నాంది..

బిహార్, జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు భారతీయ ప్రజాస్వామ్యానికి ఒక గుణపాఠం: కేవలం పాత పద్ధతులు లేదా సాంప్రదాయ వర్గాలు మాత్రమే గెలుపును నిర్ణయించలేవు. పనితీరు, సంక్షేమం, అభివృద్ధి మరియు సమర్థవంతమైన పాలన వంటి అంశాలకే ప్రజలు పెద్దపీట వేస్తారని నిరూపించాయి. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాలు, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి, తమ హామీలను నెరవేర్చడానికి మరియు ప్రజల ఆకాంక్షలను చేరుకోవడానికి కట్టుబడి ఉండాలి.

**ఫిరోజ్ ఖాన్**
**సీనియర్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**



# సర్వే నంబర్‌లో దొంగలు పడ్డారు

**1088,1088/1లో అక్రమ పట్టాల కుంభకోణం**

## భూపాల్‌పల్లి జిల్లా దాయరంచపల్లి రైతుల అరణ్య రోదన





ప్రత్యేక ప్రతినిధి, నవంబర్ 11 (సమయం న్యూస్): భూపాలపల్లి జిల్లాలోని గోరి కొత్తపల్లి మండలంలోని చిన్నకొడపాక రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 1088లో ప్రభుత్వ భూములు 1970 దశకంలో దామరంచపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే, అప్పటి నుండి ఈ భూములపై అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ సైనికులకు కేటాయించిన భూములను గ్రామ రైతులు కొనుగోలు చేయడం, ఆ తర్వాత కాలంలో రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయక పోవడం లాంటి అక్రమాలు జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి ప్రారంభమైన ఈ అక్రమాలు క్రమంగా పెరిగి, ధరణి వ్యవస్థలో కూడా కొనసాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఒక్క సర్వే నంబర్ లోనే కాదు గ్రామంలో కొన్ని సర్వే నంబర్ లో కూడా ఇదే దుస్థితి. కుటుంబ సంబంధం లేని వారి కూడా వారసులుగా నమోదు చేసుకొని రుణ మాఫీ, రైతుబంధు పథకాలు దర్జాగా పొందుతున్నారు. కొంతమంది వి.ఆర్.ఓ.లు లంచాలు తీసుకొని అసలు సాగు చేసే రైతుల పేర్లకు బదులుగా అక్రమంగా బినామీల పేర్లను ధరణిలో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో నిజంగా సాగు చేస్తున్న రైతులు పట్టాలు పొందలేకపోతుండగా, అక్రమంగా నమోదు చేసుకున్న వారు మాత్రం రైతు బంధు లబ్ధి పొందుతున్నారని రైతులు తెలిపారు. గ్రామ సర్పంచి సాయం తో వారి మిత్రబృందం కూడా కొందరు అక్రమంగా పట్టాలు పొందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రైతులు ప్రభుత్వం తక్షణమే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భూభారతి పద్ధతి ద్వారా రికార్డు ప్రక్షాళన చేపట్టినప్పటికీ, రెండు సంవత్సరాలు గడిచినా దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తీసుకున్న భూములపై ఇప్పుడు కొడుకుల పేర్లను నమోదు చేయడంలో పాత రికార్డుల లేమి వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని వారు తెలిపారు."ప్రభుత్వం భూభారతి ద్వారా కూడా క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, అక్రమ పేర్లను తొలగించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి" అని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సర్వేనంభ లో భూమి ఎక్కువగా చూపిస్తున్నారు పట్టా రాని వారు ప్రస్తుతం వారే సాగుచేసుకుంటున్నారు. బినామీ పేరు పై నమోదు చేయడం మూలంగా అసలైన లబ్ధిదారులు కు పట్టా ఇవ్వలేక పోతున్నారు దానికి సర్వే నంబర్ లో నిర్దేశించిన భూమి కంటే ఎక్కువ భూమి ఉండడం మూలంగా కూడా పట్టా పొందడం లేదని రైతులు వాపోతున్నారు. ఇక జిల్లా కలెక్టర్ అక్రమంగా రికార్డు లో నమోదు చేసుకున్న వారిని తొలగించి నిజమైన లబ్ధిదారులుకు ప్రభుత్వంపట్ట దారు పాస్ పుస్తకం పంపిణీ చేసే రైతు బంధు వచ్చే విధంగా చూడాలని ఈ గ్రామంలో ఎక్కువ శాతం సన్న చిన్న కారు రైతులు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రామ రైతులకు న్యాయం జరుగుతుందని ఆశిద్దాం..

**ముఖ్యమంత్రి ప్రజావానికి దరఖాస్తు చేసుకున్నాయిప్పటి వరకు న్యాయం జరగలేదని గ్రామ రైతు ఆరోపిస్తున్నారు.**

**(మరొక సంచికలో రైతులు బాధలు)**


# మరో ఐసీసీ టోర్నీలో ఆడనున్న కోహ్లీ, రోహిత్..?




భారత క్రికెట్ అభిమానులకు శుభవార్త! క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటింగ్ ద్వయంగా పేరొందిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. 2027 వన్డే ప్రపంచ కప్ తర్వాత కూడా ఒక కీలక ఐసీసీ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. ఈ ఇద్దరు దిగ్గజాలు కేవలం 2027 వన్డే ప్రపంచ కప్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారని భావిస్తున్న తరుణంలో, వారి కెరీర్ ప్రణాళికలు అంతకు మించి కూడా కొనసాగవచ్చని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఐసీసీ వన్డే సూపర్ లీగ్‌ను పునరుద్ధరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంటే, ఐసీసీ వన్డే సూపర్ లీగ్ ప్రారంభించే అవకాశం ఉంది. ఇదే నిజమైతే, రోహిత్, కోహ్లీలు మరో ఐసీసీ టోర్నీలో పాల్గొనే ఛాన్స్ ఉందన్నమాట. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ 50 ఓవర్ల ఫార్మాట్‌పై ఆసక్తిని పునరుద్ధరించడానికి వన్డే సూపర్ లీగ్‌ను తిరిగి ప్రారంభించేందుకు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ ఇటీవలి త్రైమాసిక సమావేశంలో ఈ ప్రతిపాదన చర్చకు వచ్చింది. 2023 ప్రపంచ కప్ తర్వాత నిలిపివేసిన ఈ లీగ్‌ను తిరిగి ప్రవేశపెట్టే దిశగా ఇది మొదటి అడుగు. ముఖ్యంగా, భారతదేశంలో జరిగిన 2023 ప్రపంచ కప్‌కు క్వాలిఫికేషన్ మార్గంగా ఐసీసీ 2020లో వన్డే సూపర్ లీగ్‌ను ప్రారంభించింది. 12 పూర్తి స్థాయి సభ్యులు, నెదర్లాండ్స్‌తో సహా 13 జట్లతో కూడిన ఈ లీగ్, అంతర్జాతీయ కట్టుబాట్ల కారణంగా కేవలం ఒక సైకిల్ తర్వాత నిలిపివేశారు. వన్డే సూపర్ లీగ్ సమయంలో, ప్రతి జట్టు నాలుగు హోమ్, నాలుగు విదేశీ సిరీస్‌లతో సహా మొత్తం ఎనిమిది మూడు మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడాల్సి ఉంటుంది. టాప్ ఏడు జట్లు 2023 ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన జట్లు అదనపు క్వాలిఫైయర్స్‌లో పోటీపడతాయి. అయితే, టీ20 క్రికెట్ వృద్ధి, ఫ్రాంచైజీ లీగ్‌ల ఆధిపత్యం పెరగడం వల్ల అంతర్జాతీయ క్యాలెండర్‌లో ఇతర ఫార్మాట్‌లకు తక్కువ స్థానం లభించింది. ఐసీసీ కొత్తగా సూపర్ లీగ్‌ను పునరుద్ధరించాలని యోచిస్తోంది. సవరించిన ఫార్మాట్‌లో, టీ20 టోర్నమెంట్‌లతోపాటుగా విండోలను సర్దుబాటు చేయవచ్చు. ఇది అన్ని దేశాలకు మరింత సమతుల్యమైన ఆట వాతావరణాన్ని అందిస్తుంది. ముఖ్యంగా, పునరుద్ధరించిన ఈ లీగ్‌ను 2031 వన్డే ప్రపంచ కప్‌నకు నేరుగా క్వాలిఫికేషన్ మార్గంగా ఉపయోగించే అవకాశాన్ని కూడా ఐసీసీ పరిశీలిస్తోంది. వన్డే సూపర్ లీగ్‌ను పునరుద్ధరించాలనే ఐసీసీ ప్రతిపాదనలో ఎన్ని జట్లు పాల్గొంటాయనే దానిపై ఇంకా స్పష్టత లేదు. అయితే, ఈ లీగ్ 2028 నుంచి తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఈ చొరవ 50 ఓవర్ల క్రికెట్‌కు పూర్తిగా ప్రత్యామ్నాయం కాకుండా, దానికి బలమైన నిర్మాణాన్ని అందించడం ద్వారా దాని ఔచిత్యాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఒక అధికారి తెలిపారు. ఈ చర్చలు జరుగుతున్నప్పటికీ, పాలక మండలి ప్రస్తుతం ప్రపంచ కప్ ఫార్మాట్‌ను 14 జట్లకు మించి విస్తరించడాన్ని పరిశీలించడం లేదు. గత ఎడిషన్లలో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత్, వన్డే ప్రపంచ కప్ 2023లో రన్నరప్‌గా నిలిచింది. గ్రూప్ దశలో అద్భుతంగా ఆడి, నాకౌట్ దశకు అజేయంగా చేరుకుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 70 పరుగుల తేడాతో ఓడించింది. అయితే, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాట్ కమిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా చేతిలో జట్టు ఓటమి పాలైంది. ఈ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి రెండు స్థానాల్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ నిలిచారు. కోహ్లీ 11 మ్యాచ్‌లలో 95.62 సగటు, 90.32 స్ట్రైక్ రేట్‌తో 765 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు ఉన్నాయి. అతను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకున్నాడు. రోహిత్ 11 మ్యాచ్‌లలో 54.27 సగటు, 125.95 స్ట్రైక్ రేట్‌తో 597 పరుగులు చేశాడు. అతని పేరిట ఒక సెంచరీ ఉంది.

# రెండో పెళ్లి చేసుకున్న రషీద్ ఖాన్!

అఫ్గానిస్థాన్ క్రికెటర్ రషీద్ ఖాన్ ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాడు. ఇటీవల రషీద్ ఖాన్ ఓ ఈవెంట్?కు హాజరయ్యాడు. ఆ సమయంలో అతడి పక్కన ఓ అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయితో రషీద్ చాలా చనువుగా ఉన్నట్లు కనిపించాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆ అమ్మాయి ఎవరా? అని నెటిజన్లు ఇంటర్నెట్?లో సెర్చ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రషీద్ ఖాన్ స్వయంగా ఓ పోస్ట్ చేశాడు. ఈవెంట్?లో అతడి పక్కన కనిపించింది తన భార్యేనని రషీద్ ఖాన్ తాజా పోస్ట్?లో చెప్పుకొచ్చాడు. '2025 ఆగస్టు 02న నా జీవితంలో ఓ అర్థవంతమైన అధ్యాయం ప్రారంభమైంది. నేను ఆశించే ప్రేమ, ప్రశాంతత లభించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను. అయితే రీసెంట్?గా ఓ ఛారిటీ ఈవెంట్?ను నేను నా భార్యను తీసుకొని వెళ్లాను. ఇంత చిన్న విషయంపై ఏవేవో ఊహాగానాలు చేయడం దురదృష్టకరం. అయితే దాచడానికి ఏమీ లేదు. ఆమె నా భార్య. మాకు మద్దతుగా నిలుస్తూ, అర్థం చేసుకుంటున్న ప్రతీ ఒక్కరికీ థాంక్యూ' అని రషీద్



రాసుకొచ్చాడు. ఇక్కడే అసలు కన్?ఫ్యూజన్ మొదలైంది. అది కొత్త అనుమానాలకు దారి తీస్తుంది. తాజా పోస్టులో రషీద్ తనకు 'ఈ ఏడాది ఆగస్టులో పెళ్లి జరిగింది' అని రాసుకొచ్చాడు. కానీ, వాస్తవానికి గతేడాది అక్టోబర్ 03నే రషీద్?కు పెళ్లి జరిగింది. అఫ్గాన్ రాజధాని కాబుల్?లోని ఓ ప్రైవేటు హోటల్?లో రషీద్, తన కజిన్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అంతేకాదు రషీద్‌తో పాటు అతడి ముగ్గురు సోదరులు జకియుల్లా, రజా ఖాన్, అమీర్ ఖలీల్ కూడా అదే రోజు వివాహం చేసుకున్నారు. అయితే అప్పుడు తన భార్య ఫొటో మాత్రం బయటకు రాలేదు. దీంతో ఇప్పుడు రషీద్ చెబుతున్నది తన రెండో వివాహం గురించే కావొచ్చని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఒక్కొక్కరు ఒక్కో రకంగా స్పందిస్తున్నారు. తొలి వివాహం 2024 అక్టోబర్?లో అయితే, తాజాగా 2025 ఆగస్టులో పెళ్లి అని చెప్పడంతో అభిమానులు కన్?ఫ్యూజ్ అవుతున్నారు. కొంతమంది నెటిజన్లు అయితే, రషీద్ రెండో వివాహం చేసుకున్నాడని పోస్టులు షేర్ చేస్తున్నారు. '10 నెలల గ్యాప్?లోనే రెండు పెళ్లిళ్లా' అని షాక్ అవుతున్నారు. కానీ, అతడు మొదటి భార్యకు విడాకులు ఇచ్చి, ఆగస్టులో రెండో వివాహం చేసుకున్నాడా? లేదా తొలి వివాహాన్ని కొనసాగిస్తూనే, ఈ పెళ్లి చేసుకున్నాడా అనేది తెలియాల్సి ఉంది. 27 ఏళ్ల రషీద్ ఖాన్ ప్రస్తుతం అఫ్గానిస్థాన్ T20 జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. 2015లో అంతర్జాతీయ క్రికెట్?లోకి ఎంట్రీ ఇచ్చిన అతడు ఇప్పటిదాకా 6 టెస్టులు, 117 వన్డేలు, 108 T20 మ్యాచ్‌లలో ఆడాడు. టెస్టుల్లో 45 వికెట్లు, 920 పరుగులు చేయగా, వన్డేల్లో 210 వికెట్లు, 4127 రన్స్ సాధించాడు. ఇక టీ20ల్లో 182 వికెట్లు పడగొట్టిన అతడు, 2492 పరుగులు నమోదు చేశాడు.

# నితీష్ స్థానంలో జురెల్ బరిలోకి దిగుతాడు

## టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే




సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరగనున్న రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమవుతోంది. కోల్‌కతా వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్ట్‌లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు సన్నద్ధమవుతున్నాయి. ఈ సిరీస్‌లో గెలిచిన జట్లకు డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు మెరుగవనున్నాయి. దాంతో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇంగ్లండ్ పర్యటనలో గాయపడిన వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. దాంతో తుది జట్టు ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రిషభ్ పంత్ గౌర్హాజరీలో ధ్రువ్ జురెల్ మెరుగ్గా రాణించాడు. వెస్టిండీస్‌తో సెంచరీ చేయడంతో పాటు సౌతాఫ్రికా-ఏతో రెండో అనధికార టెస్ట్‌ల్లో రెండు శతకాలు నమోదు చేశాడు. ప్రస్తుతం ధ్రువ్ జురెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. తుది జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్‌తో పాటు మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇద్దరు వికెట్ కీపర్లతో బరిలోకి దిగితే తుది జట్టులో నుంచి ఎవర్ని తప్పించాలనేది చర్చనీయాంశంగా మారింది. సాయి సుదర్శన్‌ను పక్కన పెట్టాలనే డిమాండ్ వ్యక్తమైంది. కానీ టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మాత్రం నితీష్ కుమార్ రెడ్డి స్థానంలో ధ్రువ్ జురెల్ బరిలోకి దిగుతాడని హింట్ ఇచ్చాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన డస్కాటే.. నితీష్ కుమార్ రెడ్డి తొలి టెస్ట్ ఆడే అవకాశం లేదన్నాడు. 'నితీష్ కుమార్ రెడ్డి విషయంలో మా వైఖరి మారలేదు. ఆస్ట్రేలియా పర్యటనలో అతనికి అవకాశం దక్కలేదు. కానీ సౌతాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో నెలకొన్న పోటీ కారణంగా అతనికి తుది జట్టులో ఆడే అవకాశం దక్కదని నేను భావిస్తున్నాను. బ్యాటింగ్ డెప్త్, స్పెషలిస్ట్ బౌలర్లతో జట్టును సమతూకంగా ఉంచుకోవడం కీలకం. కేవలం ఒక ఆల్‌రౌండర్ కోసం స్పెషలిస్ట్ ప్లేయర్‌ను పక్కనపెట్టాలని మేం అనుకోవడం లేదు. ధ్రువ్ జురెల్‌ను తుది జట్టులో ఆడుతాడు. అతను సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ధ్రువ్ జురెల్, రిషభ్ పంత్ ఇద్దరూ బరిలోకి దిగుతారు. ఈ ఇద్దరిలో ఒకరు లేకపోయినా నేను ఆశ్చర్యపోతాను.'అని ర్యాన్ టెన్ డస్కాటే చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ ఆడిన నితీష్ కుమార్ రెడ్డి పక్కటెముకల గాయంతో టీ20 సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు.

## జడేజా,శాంసన్ ట్రేడ్‌కు బ్రేకులు వేసిన ఐపీఎల్ రూల్




ఐపీఎల్ 2026 రిటెన్షన్ దగ్గర పడుతున్న నేపథ్యంలో, మినీ వేలానికి ముందు తమ స్క్వాడ్‌లలో మార్పులు చేయడానికి ఫ్రాంచైజీలు ఇప్పటికే ట్రేడ్ చర్చల్లో ఉన్నాయి. నవంబర్ 15 రిటెన్షన్‌లకు చివరి రోజు కావడంతో, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా ట్రేడ్ నియమాలను అర్థం చేసుకోవడం చాలా కీలకం. ఈ వ్యవస్థ జట్లను ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్లను ట్రేడ్ చేయడానికి అనుమతిస్తుంది. అయితే నిష్పాక్షికత, ఆటగాడి సమ్మతి, ఆర్థిక పారదర్శకతను ఇది నిర్ధారిస్తుంది. ఫ్రాంచైజీలు తాము ఆసక్తి ఉన్న ఆటగాళ్లపై వివిధ ఫ్రాంచైజీలతో చర్చలలో పాల్గొనడానికి స్వేచ్ఛగా ఉన్నప్పటికీ, ఆటగాడి సమ్మతి తప్పనిసరి. ఉదాహరణకు, ఒక ట్రేడ్ డీల్‌లో సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడానికి వీలవుతుంటే, రవీంద్ర జడేజా రాజస్థాన్ రాయల్స్‌లో చేరడానికి ఇష్టపడకపోతే, అతన్ని బలవంతం చేయలేరు. 2026 ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్, ఇందులో పాలుపంచుకునే అన్ని పార్టీలకు సమానంగా ఉంటుంది. విదేశీ ఆటగాళ్లకు ఏదైనా ట్రేడ్‌కు ముందు వారి స్వదేశీ బోర్డుల నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (%చీూజ%) అవసరం. ఫిట్‌నెస్, ఫీజు సమ్మతి: ఆటగాళ్లు వైద్యపరంగా ఫిట్‌గా ఉండాలి. ట్రేడ్ ఆమోదించడానికి ముందు రెండు ఫ్రాంచైజీలు అన్ని లీగ్ ఫీజులను పరిష్కరించాలి. అధికారిక ట్రేడింగ్ విండోలో జట్లు అపరిమిత ట్రేడ్‌లను చేయవచ్చు. %దీజజ×% పర్యవేక్షణ: బోర్డు ఖరారైన అన్ని ట్రేడ్‌లను నిర్ధారిస్తుంది, ప్రకటిస్తుంది, పారదర్శకతను నిర్వహిస్తుంది. ఒక సీజన్‌కు ఒక ట్రేడ్: ఒక ఆటగాడిని ఒక నిర్దిష్ట సీజన్‌లో ఒక్కసారి మాత్రమే ట్రేడ్ చేయవచ్చు. ట్రేడ్ విండో కాలపరిమితి: ట్రేడ్ విండో ఐపీఎల్ సీజన్ ముగిసిన వెంటనే తెరుచుకుంటుంది. వేలానికి ఒక వారం ముందు వరకు కొనసాగుతుంది. ఆటగాడు అధికారిక సమ్మతి పత్రంపై సంతకం చేయకుండా ట్రేడ్ జరగదు. అమ్ముతున్న, కొనుగోలు చేస్తున్న ఫ్రాంచైజీలు ట్రేడ్‌కు, దాని నిబంధనలకు పరస్పరం అంగీకరించాలి. ప్రతి ట్రేడ్‌కు అది చెల్లుబాటు కావడానికి ముందు బీసీసీఐ అధికారిక ఆమోదం అవసరం. కొనుగోలు చేసే ఫ్రాంచైజీ మొదట మరొక జట్టు నుంచి ఆటగాడి కోసం బీసీసీఐకి 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' పంపుతుంది. ఆ తర్వాత బీసీసీఐ ఆటగాడి ప్రస్తుత ఫ్రాంచైజీకి తెలియజేస్తుంది. దానికి స్పందించడానికి 48 గంటల సమయం ఉంటుంది. అంగీకరించినట్లయితే, ఆటగాడికి సమ్మతి పత్రం పంపబడుతుంది. ఒకసారి సంతకం చేసి, బీసీసీఐ కి సమర్పించిన తర్వాత, ట్రేడ్ చర్చలు అధికారికంగా ప్రారంభమవుతాయి. కొత్త జట్టు అధిక జీతం ఆఫర్ చేస్తే, అదనపు మొత్తం ఆటగాడు, అమ్ముతున్న ఫ్రాంచైజీ మధ్య విభజించబడుతుంది. జీతం కోత ఉంటే, ఆటగాడు రాతపూర్వకంగా అంగీకరించాలి. బీసీసీఐ ఆమోదం అవసరం. మొత్తం లీగ్ ఫీజును సమయానికి చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న ఏవైనా మొత్తాలు ట్రేడ్‌ను నిరోధించవచ్చు. నిబంధనల ఉల్లంఘనలు, ఆసక్తి వైరుధ్యాలు లేదా అక్రమాలను కనుగొంటే బీసీసీఐ ట్రేడ్‌లను రద్దు చేయవచ్చు లేదా తిరస్కరించవచ్చు. వేలం సమతుల్యతను కొనసాగించడానికి ప్రతి ట్రేడ్ తర్వాత ఫ్రాంచైజీ పర్స్ విలువ దానికి అనుగుణంగా సర్దుబాటు చేయబడుతుంది.





# చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు లేనట్లేనా!

2026 ఐపీఎల్ ప్రారంభానికి ఐదు నెలల సమయం ఉన్నా, రోజుకో కొత్త వార్త బయటకు వస్తోంది. ఇన్ని రోజులు ఆటగాళ్ల రిటెన్షన్, ట్రేడింగ్ గురించి వార్తలు రాగా తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు హోం గ్రౌండ్ మ్యాచ్?లకు సంబంధించి ఓ ప్రచారం జరుగుతోంది. వచ్చే సీజన్?లో ఆర్సీబీ తమ హోం గ్రౌండ్? మ్యాచ్?లను బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆడడానికి అనుమతి లభించకపోవచ్చని సమాచారం. ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా, 2025 జూన్? 04న బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 10 మంది మృతి చెందారు. దీంతో స్టేడియం సామర్థ్యం, ప్రేక్షకుల భద్రతపై అనేక అనమానాలు తలెత్తాయి. అప్పట్నుంచి చిన్నస్వామిలో అంతర్జాతీయ మ్యాచ్?లు ఒక్కటి కూడా నిర్వహించలేదు. అంతేకాకుండా వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్త వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్?కప్?లోనూ చిన్నస్వామి స్టేడియాన్ని పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఐపీఎల్ నిర్వాహకులు కూడా వచ్చే సీజన్?కు చిన్నస్వామిలో మ్యాచ్?లు నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారని తెలుస్తోంది. ఐపీఎల్ అనగానే ప్రతీ మ్యాచ్?కూ స్టేడియం హౌస్?ఫుల్ అవుతుంది. అందుకే ప్రేక్షకుల భద్రతా దృష్ట్యా నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉందట. దీంతో ఆర్సీబీ తమ హోం గ్రౌండ్ మ్యాచ్?లను వేరే స్టేడియానికి షిఫ్ట్ చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే సీజన్?లో ఆర్సీబీ హోం గ్రౌండ్ మ్యాచ్?లన్నీ పుణె స్టేడియంలో ఆడే ఛాన్స్ ఉంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు జరిగాయి. ఈ మేరకు ఎమ్?సీఏ సెక్రటరీ కమలేశ్ పిసల్ దీనిపై స్పష్టతనిచ్చారు. అయితే డిసెంబర్?లో జరగనున్న మినీ వేలం తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన మీడియాతో తెలిపారు.'ఈ విషయం ప్రస్తుతానికి చర్చల దశలోనే ఉంది, ఇంకా కన్ఫార్మ్ కాలేదు. గత సీజన్?లో తొక్కిసలాట కారణంగా కర్ణాటకలో ఆర్సీబీకి అనుమతి నిరాకరించే ఛాన్స్ ఉంది. అందుకే వాళ్లు ఒక స్టేడియం కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలోనే పుణె స్టేడియంలో హోం గ్రౌండ్ మ్యాచ్?లు నిర్వహించుకునేలా మేం వాళ్లకు ఈ ఆఫర్ ఇచ్చాము. వాళ్లు ఇతర స్టేడియాలను కూడా చూస్తున్నారు. ఇంకా ఏదీ ఫైనలైజ్ కాలేదు. దీనిపై మినీ వేలం ముగిసిన తర్వాతే స్పష్టత వస్తుంది. అయితే అంతా అనుకున్నట్లు జరిగితే, పుణె స్టేడియం ఆర్సీబీ హోం మ్యాచ్?లకు ఆతిథ్యం ఇవ్వడం దాదాపు ఖాయమవుతుంది' అని పిసల్ మీడియాకు వెల్లడించారు. ఇది ఆర్సీబీ ఫ్యాన్స్?ను నిరాశ పర్చే వార్త. ఐపీఎల్?లో అత్యంత ఎక్కువ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న జట్లలో ఆర్సీబీ ఒకటి. అక్కడి ఫ్యాన్స్ అంతా ఆర్సీబీ హోం మ్యాచ్?లకు వేల సంఖ్యలో చిన్నస్వామి స్టేడియానికి వచ్చి ఎంకరేజ్ చేస్తుంటారు. ఒకరకంగా ఆర్సీబీకి కూడా సొంత అభిమానులే బలం. కానీ ఇప్పుడు పుణెకు మ్యాచ్?లు షిఫ్ట్ అయితే మాత్రం కర్ణాటకలో ఉన్న లోకల్ అభిమానులు మాత్రం నిరాశ చెందడం పక్కా!




# ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యాపార రంగంలో కూడా తనదైన ముద్ర వేస్తోంది. కొంతకాలం ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి వచ్చింది. వరుసగా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ, నిర్మాతగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తోంది. తాజాగా సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' కింద 'మా ఇంటి బంగారం' అనే సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా పూజా కార్యక్రమం ఇటీవలే ఘనంగా జరిగింది. ఇందులో సమంతతో పాటు దిగంత్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో నటించగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత నిర్మిస్తున్నారు. ఇక సినిమాలతో పాటు సమంత వ్యాపార రంగంలో కూడా వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే ఆమె క్లాతింగ్ బ్రాండ్‌ను విజయవంతంగా నడుపుతోంది. ఆ తర్వాత పెర్ఫ్యూమ్ బిజినెస్‌లో అడుగు పెట్టిన సామ్, ఇప్పుడు మరోసారి కొత్త వెంచర్‌ను ప్రారంభించింది. తాజాగా సమంత మరో కొత్త క్లాతింగ్ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ప్రమో వీడియోను షేర్ చేసింది. వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖులు సమంతకు శుభాకాంక్షలు తెలుపుతూ .. 'సామ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా సక్సెస్ అవ్వాలి,ఎప్పుడూ యూనిక్‌గా ఉంటుంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. కొత్త వ్యాపార ప్రయాణం మొదలెట్టిన సమంత ఇప్పుడు నిజంగానే ఒక హ్యాపీ మోడ్‌లో ఉన్నట్టుంది!





## 36 ఏళ్ల తరవాత
# శివ రీ రిలీజ్

### ఆర్జీవీ, నాగ్‌లతో సందీప్ వంగా చిట్‌చాట్

నాగార్జున రామ్‌గోపాల్ వర్మకాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'శివ' 36 ఏళ్ల తర్వాతఈ నెల 14న రీ రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాగ్, ఆర్జీవీలతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చిట్‌చాట్ నిర్వహించారు. 'శివ' 36 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయబోతోంది! ఫ్యాన్స్ కోసం ప్రత్యేకమైన సంబరాలు ప్లాన్ చేశారు. ఈ వీడియోలో మూడు జంటల మధ్య సరదా, క్రేజీ ముచ్చట్లు, వెనుకబడిన హిట్ మూవీ రహస్యాలు ఇలా ఫ్యాన్స్‌కి స్పెషల్ ఎమోషనల్ మినిట్స్ పంచుకోబోతున్నారు. ఇది కేవలం ఇంట్రెస్టింగ్ వీడియో మాత్రమే కాదు, నోస్టాల్జిక్ ట్రిప్ కూడా! సందీప్, నాగ్, ఆర్జీవీ మ్యూచువల్ బాండ్, సినిమా మేకింగ్ వెనుక ఉన్న స్టోరీస్, ఫన్ రియాక్షన్స్ చూపించడంతో వీడియో మరింత స్పెషల్ అయింది.



# బెడ్ సీన్స్ చేసేప్పుడు నలిగిపోక తప్పదు

### మళయాల బ్యూటీ దివ్య స్వీయానుభవం

ఇప్పటి సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో రొమాన్స్‌కి బదులుగా లిప్‌లాక్‌లు, బెడ్‌సీన్స్ ఎక్కువవుతున్నాయి. ప్రేక్షకులు ఏమి కోరుకుంటే అదే చూపిస్తున్నామని మేకర్స్ అంటున్నారు. అయితే ఇవి నటించడం అంత ఈజీ కాదని నటి దివ్య పిళ్లై స్పష్టం చేసింది. ఎయిర్‌లైన్స్ జాబ్ నుంచి సినిమా రంగంలోకి అడుగుపెట్టిన ఈ మలయాళ బ్యూటీ, తెలుగు ప్రేక్షకులకు 'తగ్గేదేలే' సినిమాలో హీరోయిన్‌గా గుర్తుంది. ఆ సినిమాలో లిప్‌లాక్ సీన్ చేసిన దివ్య, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ అనుభవం గురించి చెప్పింది. తాను మొదటగా మలయాళంలో 'కళాపురుష్' సినిమాలో టొవినో థామస్‌తో ఇంటిమేట్ సీన్ చేశా. ఫస్ట్ నో చెప్పా చుట్టూ కెమెరాలు, జనం ఉన్నప్పుడు అసౌకర్యంగా అనిపించింది. కానీ దర్శకుడు కట్ చెప్పే వరకు నటించాల్సిందే. ఆ సమయంలో ఏం చేసినా భరించాల్సిందే.. కెమెరా ఆన్ అయిన తర్వాత నటుడు, నటి ఇద్దరూ క్యారెక్టర్‌లో లీనం కావాలి. లిప్‌లాక్ లేదా బెడ్‌సీన్ చేస్తున్నప్పుడు మనకు ఇబ్బంది అనిపించినా, ఆ ఫీలింగ్ ఫేస్‌లో కనిపించకూడదు. సీన్ పూర్తయ్యేవరకు సహ నటుడు ఏం చేసినా కూల్‌గా ఉండాలి. ఎందుకంటే ప్రేక్షకుడు చూస్తే అది ఫేక్‌గా కాకుండా నేచురల్‌గా కనిపించాలని చెప్పుకొచ్చింది దివ్య. అలాగే, 'నేను గ్లామర్ రోల్స్ చేసినా, స్క్రిప్ట్‌కి తగ్గట్టు చేస్తాను. ఎప్పుడూ లిమిట్స్ దాటను. ప్రేక్షకులు నన్ను నటిగా మాత్రమే చూడాలని కోరుకుంటానని తెలిపింది. కాగా ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో.. కొందరు నెటిజన్లు ఆమె ప్రొఫెషనలిజాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు ఇలాంటి సీన్స్ అవసరమా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. దివ్య ప్రస్తుతం రెండు మలయాళ సినిమాలు, ఒక తెలుగు వెబ్‌సిరీస్‌లో నటిస్తోంది.

# నాని ప్యారడైజ్ కోసం భారీ సెట్




టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని దసరా డైరెక్టర్‌తో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన నాని లుక్‌తోపాటు మోహన్ బాబు పోస్టర్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్ పోషిస్తోంది. సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో నాని తల్లిగా కనిపించనుంది. కాగా ది ప్యారడైజ్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఇప్పుడొక ఆసక్తికర వార్త నాని అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇంతకీ విషయమేంటంటే ది ప్యారడైజ్ కోసం హైదరాబాద్‌లో ఏకంగా రూ.7.5 కోట్లతో హౌస్ సెట్ వేస్తున్నారట. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను గుర్తుకుతెచ్చేలా ఉండబోతున్న ఈ ఇంటిని అల్యూమినియం ఫ్యాక్టరీలో నిర్మిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ వార్తతో నాని టీం ఈ సారి ఏదో పెద్ద ప్లానే వేసిందని తెగ చర్చించుకుంటున్నారు. ఇక డిసెంబర్ చివరికల్లా లేదా జనవరి మొదట్లో ఈ మూవీ నుంచి మరో గ్లింప్స్ లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. మరి దీనిపై రాబోయే రోజుల్లో మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఈ మూవీలో కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని–అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి ఫ్రెంచ్ అవార్డు

భారత సినీ రంగానికి మరో గర్వకారణం. ప్రఖ్యాత ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రదానం చేసే అత్యున్నత సత్కారం 'చెవాలియర్' కు ఆయనను ఎంపిక చేసింది. చెన్నైలోని ఫ్రెంచ్ కాన్సులేట్ కార్యాలయంలో గురువారం ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఆయనకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ తోట తరణికి అభినందనలు తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో అద్భుతమైన సెట్ డిజైన్‌లతో మాయ చూపించారు. 'నాయకుడు', 'ఇంద్ర', 'దసరథి', 'జనతా గ్యారేజ్', 'తలపతి' వంటి సినిమాల్లో ఆయన సృష్టించిన సెట్లు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి తోట తరణి గారు, అని స్టాలిన్ పేర్కొన్నారు. ఇక ఆయనకు ఇప్పటికే మూడు నేషనల్ అవార్డులు, అనేక రాష్ట్ర అవార్డులు లభించాయి. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో 'చెవాలియర్' అవార్డు పొందడం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. సినీ, కళా రంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ గౌరవం అందజేస్తున్నట్లు ఫ్రెంచ్ అధికారులు తెలిపారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# విద్యాతోనే పేదరికం నుంచి విముక్తి.

- 28 మంది విద్యార్థిని,విద్యార్థులకు ప్రశంస పత్రాలు
- అందజేసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్-విజయకుమార్



**కోస్గి మున్సిపల్(మం)నవంబర్,12(సమయం న్యూస్) :** విద్యతోనే పేదరికం నుంచి విముక్తు లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయకుమార్ అన్నారు.బుధవారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదువుల పండుగ కార్యక్రమం సందర్భంగా కోస్గి మండలంలోని 28 మంది విద్యార్థినీ విద్యార్థులకు అభినందన ప్రశంస పత్రాలు అందజేశారు.విద్యా ద్వారానే మానవ అభివృద్ధి సాధ్యపడుతుంది అన్నారు.నేటి సమాజంలో ప్రతి ఒక్కరు విద్యాలో రాణిస్తున్నారని, ముఖ్యంగా చదువు పట్ల బాధ్యతగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ నాయక్, సోషల్ వర్కర్ మన్నె బస్వరాజ యాదవ్, ప్రధానోపాధ్యాయులు రామశర్మ,అఖిల్ యాదవ్, నాగరాజు,సత్య కుమార్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు, కేజీబీవీ లను ఆకస్మికంగా తనిఖీ

- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

**నెల్లికుదురు నవంబర్12( సమయం న్యూస్).:** బుధవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, నెల్లికుదురు మండల కేంద్రం, రామన్నగూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో (255) కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సెంటర్స్ లో అన్ని వసతులు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల రైతులకు ఎలాంటి పంట నష్టం జరగకుండా ముందస్తు సమాచారం అందిస్తూ రైతులను అప్రమత్తం చేయాలన్నారు, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వెంట వెంటనే తరలించాలని, రైతుల వివరాలు ఆన్లైన్ లో నమోదు చేసి డబ్బులు త్వరగా రావడం కోసం నివేదికలు పంపాలన్నారు, కేంద్రాలలో గన్ని సంచులు, తార్పాలిన్లు, మ్యాచ్చర్ మిషన్, ప్యాడీ క్లీనర్స్, వేయింగ్ మిషన్స్, అందుబాటులో ఉంచుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ధాన్యం తరలింపు విషయంలో పూర్తి అవగాహన కల్పించాలని ఎఫ్ క్యూ నాన్స్ ప్రకారం ధాన్యాన్ని తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలనీ తద్వారా రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చి లబ్ధి పొందుతారని సూచించారు,ధాన్యం రవాణా విషయంలో వాహనాలను నిత్యం సిద్ధంగా ఉంచుకోవాలని, హమలీలు, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు,

వ్యవసాయ, సహకార, గిరిజన కార్పొరేషన్, డిఆర్డిఏ, ఐకెపి పౌరసరఫరాలు, తహసీల్దారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ జిల్లా లక్ష్యం విజయవంతంగా నిర్వహించి, కొనుగోలను పూర్తిచేయాలని సూచించారు,అలాగే ప్యాడి,పత్తి, సోయా, తదితర పంటల కొనుగోళ్ల విషయంలో ఇప్పటికే క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి శిక్షణ తరగతులు ఇవ్వడం జరిగిందని, పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉంటూ కొనుగోలను నిర్వహించాలని ఆదేశించారు.కేజీబీవీ నీ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టోర్ గది, టాయిలెట్స్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, పరిసరాలను పరిశీలించారు, పిల్లలకు హెల్త్ ఎడ్యుకేషన్ న్యూట్రిషన్ సానిటేషన్ లపై అవగాహన కల్పించి సిబ్బంది షెడ్యూల్ ప్రకారం పై కార్యక్రమాలు నిర్వహించాలని, నూతన విద్యా విధానం డిజిటల్ తరగతులు ప్రతి సబ్జెక్టు పై పట్టు సాధించే విధంగా విద్యార్థులకు అవసరమైన విద్య బోధనలు ప్రత్యేక తరగతులు నిర్వహించాలనీ సూచించారు,ఆయన వెంట స్థానిక తహసిల్దార్ నరేష్ ,సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం



**హనుమకొండ నవంబర్ 12( సమయం న్యూస్). ::** 2002 సంవత్సరంలో నమోదైన ఓటర్ల జాబితాను ప్రస్తుతం ( 2025) ఉన్న ఓటర్లతో పాటు వారి సంతానంలో ఉన్న ఓటర్లను స్పెషల్ ఎంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ )లో సరిపోల్చడం జరుగుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీవోలు/ ఈఆర్వోలు, అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో రానున్న రోజుల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్లను నమోదు చేయడం, చనిపోయిన ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడం, ఓటర్ల జాబితాలో ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో అవసరమైన సవరణలు చేయడం జరుగుతుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సజావుగా సాగాలంటే బూత్ లెవెల్ అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించే బూత్ లెవెల్ ఏజెంట్ల ఆవశ్యకత ఉందన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ల నిర్ణీత జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులు అందజేయాలని కోరారు.

ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు/ ఈఆర్వోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, రావు అమరేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, సయ్యద్ ఫైజుల్లా, నాగవెల్లి రజనీకాంత్, బి. ప్రవీణ్ కుమార్, ఎండి.నేహాల్, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల అభివృద్ధికి 3 కోట్ల 80 లక్షలు మంజూరు

- మంత్రి పొంగులేటి



**ఖమ్మం, నవంబర్ 12 :( సమయం న్యూస్ ) :** దానవాయి గూడెం గురుకులాన్ని ఆదర్శ వంతంగా తయారు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.మంత్రి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి దానవాయిగూడెంలో టి.జి.ఎస్. డబ్ల్యు.ఆర్. పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు) భవన మరమ్మతు పనులకు బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం మున్నేరు నదికి వచ్చిన భారీ వరదల కారణంగా ఈ పాఠశాలలోని విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ గడిపారని, అప్పుడు పిల్లలకు ఇచ్చిన మాట మేరకు 3 కోట్ల 80 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని అన్నారు.లో లెవల్ పాఠశాలకు ఎర్త్ ఫిల్లింగ్ చేయడం, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్ పూర్తి చేయడం, వెయిటింగ్ హాల్, జనరేటర్ ఏర్పాటుకు 3 కోట్ల 80 లక్షల రూపాయలు వినియోగించుకోవాలని, యుద్ధ ప్రాతిపదికన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు. కాంపౌండ్ లోపల లో లెవెల్ ఉన్న భూమి అయితే ఫిల్లింగ్ పనులు సమాంతరంగా చేపట్టాలని మంత్రి తెలిపారు. క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇటీవలే మహిళా క్రికెట్ టీమ్ ప్రపంచ చాంపియన్ గా నిలిచిందని, బాలికలు క్రీడలలో రాణించాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, దానికి అనుగుణంగా ఇక్కడ అవసరమైన క్రీడా ఇన్ ఫ్రా ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు అందించాలని మంత్రి అన్నారు. బాలికలు కోరితే ఇక్కడ స్థానికంగా క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. ప్రతి ఒక్క రూపాయి బాలికలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు డిజైన్ చేసుకోవాలని అన్నారు. పిఎస్ఆర్ ట్రస్ట్ నుంచి పాఠశాలకు గతంలో అవసరమైన ఫర్నిచర్ పంపిణీ చేశామని అన్నారు. దానవాయి గూడెం గురుకుల పాఠశాలను ఆదర్శవంతంగా తయారు చేసే బాధ్యత తీసుకుంటామని అన్నారు.పిల్లలు, తల్లిదండ్రుల కష్టాన్ని గమనించి జీవితంలో ఎదగాలని అమ్మ, నాన్న లను బాగా చూసుకోవాలని అన్నారు. ప్రతి బాలిక జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధన దిశగా కృషి చేయాలని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మంత్రి చొరవతో బాలికల గురుకుల పాఠశాలకు నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వినియోగించు కుంటూ ఆదర్శంగా గురుకులం తీర్చిదిద్దాలని అన్నారు. గురుకులంలో చేపట్టే పనులు పూర్తి స్థాయి నాణ్యతతో ఉండాలని, ప్రిన్సిపల్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. బాలికల క్రీడలను ప్రోత్సహిస్తూ అవసరమైన వాలీ బాల్ కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేయాలని అన్నారు. ల్యాబ్ పరికరాలు అవసరమైనవి చేపట్టాలని అన్నారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలను ఉన్నతాధికారులు రెగ్యులర్ గా తనిఖీ చేస్తూ పిల్లలకు అందించే ఆహారం నాణ్యతను పరిశీలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, ఇర్రిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ దుర్గ, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- వరంగల్ పార్లమెంట్ సభ్యులు డా. కడియం కావ్య తెలిపారు.



**జయశంకర్ భూపాల పల్లి నవంబర్12( సమయం న్యూస్).** బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీలో శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను కూడా వైద్య విద్యనభ్యసించి 8 సంవత్సరాలు పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలకు మీ దగ్గరకు వచ్చే ప్రజలకు ప్రేమతో వైద్య సేవలు అందించాలని తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులు గా నిలబడాలంటే ఎన్నో ఆటుపోట్లను, సవాళ్ళను ఎదుర్కొవాల్సి వస్తుందని ధైర్యంగా ఎదుర్కొని మంచి వైద్యులుగా స్థిర పడాలని సూచించారు. ఈ ప్రాంతానికి వైద్య కళాశాల మణిహారమని మీరు చదువుకున్న కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. సిన్సియర్ గా పని చేసి ప్రజలకు వ్యాధి తగ్గించి మంచి పేరున్న వైద్యులని పేరు సాధించాలని స్పష్టం చేశారు. భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వైద్య వృత్తిలో మంచి అనుభవాన్ని పొంది ప్రత్యేక వైద్యులుగా నిలవాలని తెలిపారు. భూపాలపల్లి లో చదివామన్న మంచి పేరు కళాశాలకు, ఈ ప్రాంతానికి తీసుకురావాలని సూచించారు. సింగరేణి, కేటీపీపి సిఎస్ఆర్ నిధులు ఈ ప్రాంత విద్య, వైద్య రంగాలకు కేటాయించాలని తెలిపారు. ఖనిజ సంపద ఇక్కడి నుండే వస్తుంది కాబట్టి విద్యా, వైద్య రంగాలతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని తెలిపారు. 300 మంది విద్యార్థులు ఇక్కడ వైద్య విద్యను అభ్యసించడం పట్ల ఆయన అభినందించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థికి వైట్ కోర్టు రావడం అనేది ఒక మదురమైన అనునభూతి అన్నారు. బాగా చదివి మంచి వైద్యులుగా తయారై పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్య కళాశాలల్లో మంచి ఫ్యాకల్టీ ఉందని వైద్య విద్యార్థులు మంచిగా చదివి మానవత్వంతో ప్రజలకు మేలైన మెరుగైన వైద్య సేవలు అందించాలని. తెలిపారు ఈ ప్రాంతం చాలా వెనుకబడున ప్రాంతమనని ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరావు, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, కేటీపీపీ సీఈ శ్రీ ప్రకాష్, వైద్య కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజు.. మూడు జిల్లాల అభ్యర్థులకు హనుమకొండ జేఎన్ఎస్ లో కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్ మెంట్





**హనుమకొండ నవంబర్12( సమయం న్యూస్). :** హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో డిడిజి ( స్టేట్స్), జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్ చెన్నై,డైరెక్టర్ రిక్రూటింగ్ ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో భాగంగా ఆర్మీ పరీక్షలో ఇంతకుముందే ఉత్తీర్ణత సాధించిన మూడు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఆర్మీ అధికారులు ఆర్మీలో ఎంపికకు వివిధ పరీక్షలను బుధవారం నిర్వహించారు.కుమురంభీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు 794 ఆర్మీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులు కాగా జేఎన్ఎస్ లో నిర్వహించిన ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఎంపిక పరీక్షకు 623 హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడు జిల్లాలకు చెందిన 623 మంది అభ్యర్థులకు ఆర్మీ అధికారులు రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలను నిర్వహించి అభ్యర్థుల ఎత్తు, బరువు, ఛాతీ ప్రమాణాలను కొలిచారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీలో పాల్గొంటున్న అభ్యర్థులు నిర్ణీత సమయంలో పరుగును పూర్తి చేసేందుకు ఉత్సాహంగా పరిగెత్తుతున్నారు. ఆర్మీలో చేరడమే లక్ష్యంగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాగా మంగళవారం రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్, పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థులకు బుధవారం మెడికల్ ఎగ్జామ్ నిర్వహించారు.